RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 22 ఫిబ్రవరి 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:222

# పేదల ఇండ్ల నిర్మాణానికి కేంద్రం సహకరించాలి

**గ్రామీణ ప్రాంతాలలో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు ?**

**కనీసం ఈ ఏడాదిలోనైనా 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి**

**కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి**

**పేదల సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం**





హైదరాబాద్:- తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. కానీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజురు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజురు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. "గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్ల క్రితం రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వచ్చే మూడు సంవత్సరాలలో రాష్ట్రం లో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజురు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుంది. తెలంగాణ రాష్ట్రం గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ (PMAY-G) 1.0లో భాగస్వామ్యం కాలేదు. అయితే 2023 తరువాత మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (MoRD) మార్గదర్శకాల ప్రకారం PMAY 2.0 లో రాష్ట్రం అధికారికంగా చేరింది.2024 ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం ఖఓంజ-ఉ 2.0కు ఆమోదం తెలిపి, ఆవాస్+2018 సర్వే నవీకరణ తర్వాత సాచురేషన్ పద్ధతిలో గృహాల మంజూరు చేయాలని నిర్ణయించినప్పటికీ, పాత డేటా ఆధారంగా 2024-25 మరియు 2025-26 సంవత్సరాలకు ఇతర రాష్ట్రాలకు 1.19 కోట్ల గృహాలను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం PMAY-G 1.0 లో భాగస్వామ్యం కాకపోవడంతో 2018 పెండింగ్ డాటా లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల డేటాబేస్‌ను సిద్ధం చేసుకుంది. అయినప్పటికీ, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్+2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించడం జరిగింది.తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లను మజూరు చేయాలని" మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి విజ్ఞప్తి చేశారు.పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు

వార్తా 2 లో

## మార్చి 31లోగా దేశంలో నక్సలిజం అంతం:

## మంత్రి అమిత్ షా



గౌహతి ఫిబ్రవరి 21 ;: మార్చి 31 లోగా దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. 87వ సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఆయన చెప్పారు. అక్కడ రాళ్లు రువ్వే ఘటనలు సున్నాకు పడిపోయినట్లు వెల్లడించారు. మణిపూర్‌లోనూ వర్గ హింసను ఆ దళాలు కట్టడి చేసినట్లు చెప్పారు. కేవలం మూడేళ్లలో మావోయిస్టుల వెన్ను విరిచినట్లు సీఆర్పీఎఫ్‌ను మంత్రి షా కీర్తించారు. సీఆర్పీఎఫ్‌పై నమ్మకంతో కాన్ఫడెంట్‌గా చెబుతున్నానని, దేశంలో 2026 మార్చి 31వ తేదీ వరకు నక్సల్ సమస్యను నిర్మూలించనున్నట్లు షా తెలిపారు.చత్తీస్‌ఘడ్-తెలంగాణ బోర్డర్‌లో ఉన్న కర్రెగుట్టలో ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌ను చేపట్టిన దళాలపై మంత్రి షా ప్రశంసలు కురిపించారు. ఆ ఆపరేషన్‌లో గత ఏడాది ఏప్రిల్, మే మధ్య కాలంలో 31 మంది నక్సల్స్ మరణించారు. సుమారు 46 డిగ్రీల ఎండలో ఆ ఆపరేషన్ చేపట్టినట్లు చెప్పారు. నక్సల్స్ ఆధీనంలో ఉన్న ఆ కొండల్ని విముక్తి చేసేందుకు కేంద్ర రిజర్వ్ పోలీసులు దళాలు అత్యంత ధైర్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు.పదేళ్ల క్రితం దేశంలో మూడు అతిపెద్ద హాట్‌స్పాట్ కేంద్రాలు ఉండేవని, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్యంలో చొరబాటులు, చత్తీస్‌ఘడ్ అడవుల్లో నక్సలిజం పెద్ద సమస్యగా ఉండేవని, కానీ ఇప్పుడు ఆ ప్రాంతాలు ప్రగతి, శాంతికి సంకేతంగా మారాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో 700 మంది సీఆర్పీఎఫ్, నక్సల్ ప్రాంతాల్లో 780 మంది, జమ్మూకశ్మీర్‌లో 540 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు మంత్రి వెల్లడించారు. వీరి త్యాగాల వల్ల ఒకప్పుడు హింసకు కేంద్ర బిందువులైన ఆ ప్రాంతాలు ఇప్పుడు శాంతియుతంగా మారాయన్నారు.

## పార్టీలో అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉంటాయి
## దాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఆలోచన చేయాలి
## వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో డిసిసి అధ్యక్షులే కీలకం:
## సిఎం రేవంత్ రెడ్డి


హైదరాబాద్ ఫిబ్రవరి 21 పార్టీలో అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉంటాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఆలోచన చేయాలని అన్నారు. 11రోజుల పాటు డిసిసి అధ్యక్షుల శిక్షణా కార్యక్రమాలు జరగనున్నాయి. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో డిసిసి అధ్యక్షులే కీలకం అని అన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ లో సిఎం మీడియాతో మాట్లాడుతూ.. కుటుంబ త్యాగాల చరిత్ర ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 150 రోజులు పాదయాత్ర చేశారని, మిమ్మల్ని పార్టీ అధ్యక్షుల్ని చేసిందని తెలియజేశారు. మాదే సామ్రాజ్యం అనుకుంటే, ఇక్కడి నుంచే ఫెయిల్యూర్ మొదలవుతుందని, తాను పిసిసి ప్రెసిడెంట్ అయ్యాక ఏం జరిగిందో చూశారని అన్నారు. ప్రతి నాయకుడి ఇంటికి వెళ్లానని, నచ్చ చెప్పానని, ఆ తర్వాత నేతల ఆలోచనలో మార్పు వచ్చిందని రేవంత్ పేర్కొన్నారు. అందరం కలిసి పని చేస్తే సరిగ్గా రెండున్నర ఏళ్లలో అధికారంలోకి వచ్చామని, ఎవరికి వారసత్వంగా హోదా రాలేదని చెప్పారు. 140 ఏళ్ల క్రితం ప్రారంభమైన పార్టీ, 140 కోట్ల మందికి స్ఫూర్తి నింపుతోందని, అలాంటి బిజెపి వారసతవం ఉన్నవాళ్లు బుల్లెట్ వర్షం కురిపించారని విమర్శించారు. బ్రిటీషర్ల జాతిపిత మహాత్మ గాంధీపై లాఠీ ఎత్తడానికి భయపడ్డారని, మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని, ఒక కోటాలో మీరంతా డిసిసి అయ్యారని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలనే కుట్ర జరుగుతుందని మండిపడ్డారు. 60 రోజుల్లో 40 లక్షల సభ్యత్వ నమోదు చేశారని అన్నారు. డిసిసి అధ్యక్ష పదవి విలువైందని, దాన్ని ప్రజల కోసం వాడుకోండని, లేదంటే మిమ్మల్ని ఎవరు కాపాడలేరని రేవంత్ రెడ్డి సూచించారు.

## ప్రియాంక గాంధీని కలిసిన ఉప ముఖ్యమంత్రి భట్టి
## కుమారుడి వివాహానికి ఆహ్వానం



న్యూఢిల్లీ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.మార్చి 5వ తేదీన హైదరాబాద్లో జరగనున్న అయన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూ వరులను ఆశీర్వదించాలని కోరుతూ, వివాహ పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించారు.

## దాడులకు లష్కరే తొయిబా ప్లానింగ్..
## ఢిల్లీలో హై అలర్ట్.. భద్రత కట్టుదిట్టం



న్యూ డిల్లీ ఫిబ్రవరి 21 );దేశ రాజధాని ఢిల్లీలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. అలాగే ప్రధాన దేవాలయాల్లోనూ అలర్ట్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా అనేక చోట్ల భద్రతను కట్టుదిట్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీతోపాటు పలు దేవాలయాలపై పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తొయిబా అనే తీవ్రవాద సంస్థ దాడులకు కుట్ర పన్నిందని ఇంటెలిజెన్స్ హెచ్చరించిన సంగతి తెలిసిందే.ఢిల్లీతోపాటు ప్రముఖ నగరాలు, ప్రధాన దేవాలయాలు వంటి రద్దీ ప్రదేశాల్ని లష్కరే తొయిబా సంస్థ టార్గెట్ చేసుకున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ముఖ్యంగా ఢిల్లీలోని చారిత్రక ప్రదేశాలైన ఎర్రకోట, చాందినీ చౌక్, పరిసర దేవాలయాల్లో ఐఈడీలతో పేలుడుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు భద్రతను మరింత పెంచి హై అలర్ట్ ప్రకటించారు. అన్ని స్థాయిల్లో భద్రతను 24 గంటలు పర్యవేక్షించేలా పార్లమెంటరీ బృందాలు పని చేస్తున్నాయి. ఇటీవల పాకిస్తాన్‌లో మసీదు వద్ద మానవ బాంబు దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు పాకిస్తాన్ ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. దీనిలో భాగంగా పాక్‌కు చెందిన ఉగ్రసంస్థ లష్కరే తొయిబా ఇండియాలో పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు రహస్య సమాచారం అందింది.దేశంలోని ప్రధాన దేవాలయాల్ని కూడా ఈ ఉగ్రసంస్థ టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. అందుకే ఆయా ప్రాంతాల్లో పోలీసులు, భద్రతా సిబ్బందిని భారీ సంఖ్యలో మోహరించారు. లష్కరే తొయిబా సంస్థకు మోస్ట్ వాంటెడ్ టెర్రిస్ట్ అయిన హఫీజ్ సయీద్ నాయకత్వం వహిస్తున్నాడు. గత ఏడాది నవంబర్ 25న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కార్ బాంబ్ బ్లాస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 12 మంది మరణించగా, 20 మందికిపైగా గాయపడ్డారు.

## దేశంలో అర్హత లేని 32 ఫేక్ యూనివర్సిటీలుగుర్తించిన యూజీసీ..

### . తాజాగా ఫేక్ యూనివర్సిటీల జాబితాను విడుదల




హైదరాబాద్ ఫిబ్రవరి 21 ;దేశంలో అర్హత లేని ఫేక్ యూనివర్సిటీలు 32 ఉన్నట్లు యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) గుర్తించింది. ఫేక్ యూనివర్సిటీల జాబితాను తాజాగా విడుదల చేసింది. వీటిలో చదివే, చదవాలనుకునే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని యూజీసీ హెచ్చరించింది. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని, ఉన్నత విద్యా విభాగం ఆధ్వర్యంలో పని చేసే యూజీసీ.. దేశంలో కొనసాగుతున్న యూనివర్సిటీల అర్హతలపై సమీక్ష చేస్తుంది.తనిఖీలు నిర్వహించి.. తగిన అర్హతలుంటే అనుమతులివ్వడం లేదంటే నిరాకరించడం, బ్లాక్ లిస్టులో పెట్టడం వంటివి చేస్తుంది. ప్రతి ఏటా అలా అర్హత లేని యూనివర్సిటీలను గుర్తించి, నోటీసులు జారీ చేస్తుంటుంది. విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది. దీనిలో భాగంగా తాజాగా దేశంలో 32 యూనివర్సిటీలు ఫేక్ అని వెల్లడించింది. యూజీసీ యాక్ట్ ప్రకారం ఈ యూనివర్సిటీలు ఇచ్చే డిగ్రీలు, పీజీలు వంటివి చెల్లవు. వాటికి చట్టబద్ధత లేదు. అంటే ఆ యూనివర్సిటీలు జారీ చేసే సర్టిఫికెట్లు ఎందుకూ పనికిరావు. ఇలాంటి యూనివర్సిటీల్లో ఢిల్లీ టాప్‌లో ఉంది. ఇక్కడ 12 యూనివర్సిటీలు ఫేక్ అని తేలింది.ఏపీలో గుంటూరులోని క్రిస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, విశాఖపట్నంలోని బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా అనే యూనివర్సిటీలు ఫేక్ అని వెల్లడించింది. తాజా జాబితాకు సంబంధించి రాష్ట్రాల వారిగా ఫేక్ యూనివర్సిటీలు ఇలా ఉన్నాయి. ఢిల్లీలో 12, యూపీలో 4, ఏపీలో 2, కర్ణాటకలో 2, కేరళలో 2, మహారాష్ట్రలో 2, పుదుచ్చేరిలో 2, పశ్చిమ బెంగాల్‌లో 2, అరుణాచల్ ప్రదేశ్‌లో 1, హరియాణాలో 1, ఝార్ఖండ్‌లో 1, రాజస్థాన్‌లో 1 చొప్పున యూనివర్సిటీలు ఫేక్ అని తేలింది.

## కాంగ్రెస్ నాయకుల రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి నైతిక దాడులు

### భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆగ్రహం



హైదరాబాద్ ఫిబ్రవరి 21కామారెడ్డిలో కాటిపల్లి వెంకట రమణారెడ్డి గారి క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో చర్చకు స్థానం ఉండాలి గానీ, హింసకు కాదు. కాంగ్రెస్ నాయకుల రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఈ విధమైన అల్లర్లకు పాల్పడటం అత్యంత దుర్మార్గం. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కామారెడ్డిలో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే బిజెపి సహించదని హెచ్చరించారు.ఇలాంటి రాజకీయ హింసాత్మక చర్యలకు ప్రజాస్వామ్యంలో ఏమాత్రం స్థానం లేదు. మా పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం కోసం, అలాగే పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి నిజాలు ప్రజల ముందుకు తీసుకురావడం కోసం నేను స్వయంగా సంఘటన స్థలాన్ని సందర్శిస్తాను. హింసను ప్రోత్సహించే రాజకీయాలను భారతీయ జనతా పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని పేర్కొన్నారు.

## హెయిల్ టాటామణి చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యం టైలరింగ్ సర్టిఫికెట్స్ పంపిణీ



చిట్యాల ఫిబ్రవరి 21 హెయిల్ టాటామణి చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యం లో నల్గొండ జిల్లా చిట్యాల పట్టణం లో , టైలరింగ్ నేర్చుకున్న (100) వంద మంది మహిళా మణులకి చారిటబుల్ ట్రస్ట్ తరఫునుంచి టైలరింగ్ సర్టిఫికెట్స్ పంపిణీ చేసారు. ఈకార్యక్రమం చిట్యాల న్యూ మున్సిపల్ చైర్మన్ పందిరి గీత , శ్రీలత, షరీఫ్ ఉన్నిసా సమక్షంలో జరిగినది.ఈ కార్యక్రమ లో హెయిల్ టాటామణి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్,చైర్మన్ సీఈవో, డాక్టర్ కాకుమాను లూర్దు జ్యోతి చారిటీ మెంబర్స్ పోలంకి జగదీష్ కుమార్, ఎం మురళి, జి శశి కుమారి, జి రాజు, బి హేమలత, ఎం సావిత్రి,పి కవిత, ల.జోస్ఫిన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాష దినోత్సవ సందర్భంగా వీర బొమ్మ రమేష్ కు ఘన సన్మానం



హైద్రాబాద్ ఫిబ్రవరి 21 తెలుగు భాష దినోత్సవ సందర్భంగా ప్రముఖ సామాజిక వేత్త ఆదిలీల ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర చెర్మెన్ వీరబొమ్మ రమేష్ ను ఘనంగా సన్మానించారు. రవీంద్రభారతిలో జరిగిన మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ బిసి కమిషన్ చెర్మెన్ వకులా భరణం కృష్ణ మోహన్ రావు చేతుల మీదుగా సత్కరించడం జరిగింది .ఈ కార్యక్రమం లో ఆదిలీల ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ ఆదినారాయణ పాల్గొనడం జరిగింది.

## కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్తత

కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, షబీర్ అలీ మధ్య భూ కబ్జాల ఆరోపణలు ఉద్రిక్తతను రేపాయి. బీజేపీ ఎమ్మెల్యే, అరోరా భూములు కబ్జా చేశాడని షబీర్ అలీ ఆరోపించడం, దాంతో దమ్ముంటే చర్చకు రావాలని వెంకటరమణ రెడ్డి సవాల్ విసరడం తెలిసిందే. వెంకటరమణారెడ్డి సవాల్ స్వీకరించి, అతని క్యాంపు కార్యాలయానికి కాంగ్రెస్ నాయకులు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. అక్కడికి వచ్చిన కాంగ్రెస్ మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి, కారును బోల్తా పడేసారు. పరిస్థితి అదుపుతప్పడంతో కాంగ్రెస్ నాయకుడు మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## భవన్స్ న్యూ సైన్స్ కాలేజీ లో రెండు రోజులపాటు వైభవంగా వాణిజ్య ఉత్సవం




హైదరాబాద్ ఫిబ్రవరి 21 భవన్స్ న్యూ సైన్స్ కాలేజ్ 2026 ఫిబ్రవరి 18 మరియు 20 తేదీలలో రెండు రోజుల వాణిజ్య ఉత్సవం, వాణిజ్య దీపిక 2026ను నిర్వహించింది. "వాణిజ్యంలో డిజిటలైజేషన్‌ను మార్చడం: కృత్రిమ మేధస్సు ప్రభావం" అనే అంశంపై కేంద్రీకృతమైన ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రాంగణంలో వాణిజ్య శాఖ ఎంతో ఉత్సాహంగా మరియు వైభవంగా నిర్వహించింది.ఈ ప్రతిష్టాత్మక ఉత్సవం వాణిజ్య రంగంలో కృత్రిమ మేధస్సు యొక్క పరివర్తన పాత్రను అన్వేషించడంపై దృష్టి సారించింది మరియు డిజిటలైజేషన్‌లో సమకాలీన పరిణామాలను హైలైట్ చేసింది.ఈ కార్యక్రమానికి గౌరవనీయ ముఖ్య అతిథిగా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఎఊఎ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు ఆర్. వెంకటరమణ హాజరయ్యారు. గౌరవ అతిథిగా, ఎస్. రాధాకృష్ణన్, ంఎ-ఆధారిత యుగంలో వాణిజ్య భవిష్యత్తుపై అంతర్దృష్టితో కూడిన ఆలోచనలతో సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి గౌరవనీయ ప్రిన్సిపాల్ డాక్టర్. పేరాల కృష్ణారావు అధ్యక్షత వహించారు, ఆయన ప్రేరణాత్మక ప్రసంగం వాణిజ్య విద్యార్థులలో డిజిటల్ నైపుణ్యాలు మరియు ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. చైర్మన్ డాక్టర్. ఎస్. జైకిషన్, సాంకేతిక పురోగతి మరియు అభివృద్ధి చెందుతున్న ప్రపంచ వ్యాపార ధోరణులకు అనుగుణంగా విద్యార్థులను ప్రోత్సహించారు. సలహాదారు డాక్టర్ వై. అశోక్, ఫైనాన్స్, అకౌంటింగ్, టాక్సేషన్ మరియు బిజినెస్ అనలిటిక్స్ లలో కృత్రిమ మేధస్సు యొక్క పెరుగుతున్న ప్రభావాన్ని హైలైట్ చేశారు.ముఖ్య అతిథి ఆర్. వెంకటరమణ తన ముఖ్య ప్రసంగంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్పొరేట్ పాలన, సమ్మతి నిర్వహణ మరియు ఆర్థిక వ్యవస్థలను ఎలా విప్లవాత్మకంగా మారుస్తుందో వివరించారు. గౌరవ అతిథి ఎస్. రాధాకృష్ణన్ డైనమిక్ కామర్స్ ల్యాండ్‌స్కేప్‌లో పోటీతత్వాన్ని కొనసాగించడానికి డిజిటల్ సామర్థ్యాలతో తమను తాము సన్నద్ధం చేసుకోవడానికి విద్యార్థులను ప్రేరేపించారు.ఈ ఫెస్ట్‌లో భాగంగా, క్విజ్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు (ఖఖ), రంగోలి మరియు షార్ట్ ఫిల్మ్ పోటీలు వంటి అనేక ఆకర్షణీయమైన పోటీలు నిర్వహించబడ్డాయి, అన్నీ డిజిటల్ పరివర్తన మరియు వాణిజ్యంలో ంఎ అనే ఇతివృత్తంతో అనుసంధానించబడ్డాయి. విద్యార్థులు తమ విశ్లేషణాత్మక మరియు సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించి అద్భుతమైన సృజనాత్మకత మరియు ఉత్సాహంతో పాల్గొన్నారు.వివిధ పోటీలలో విజేతలకు ప్రముఖులు బహుమతులు మరియు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు అధ్యాపకులు చురుకైన భాగస్వామ్యంతో, దీని గొప్ప విజయానికి దోహదపడింది.ఈ ఫెస్ట్‌ను ప్రోగ్రామ్ కన్వీనర్ శ్రీమతి కె. అర్చన మరియు సహ-కన్వీనర్ శ్రీమతి ఎ. మాధవి మార్గదర్శకత్వంలో సమర్థవంతంగా నిర్వహించారు, వాణిజ్య శాఖలోని అన్ని అధ్యాపక సభ్యుల అంకితభావ కృషితో పాటు.వాణిజ్య దీపిక 2026 అద్భుతంగా ముగిసింది, విద్యార్థులు వాణిజ్య రంగంలో డిజిటల్ పరివర్తన మరియు ఆవిష్కరణలను స్వీకరించడానికి ప్రేరణనిచ్చింది.

## ఎంపి ఈటల రాజేందర్ హౌస్ అరెస్ట్



హైదరాబాద్ ఫిబ్రవేరి 21కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ను పరామర్శించేందుకు కామారెడ్డి బయలుదేరిన ఈటల రాజేందర్ ను అడ్డుకున్న పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఏసీపీతో సహ పెద్దయెత్తున ఈటల నివాసానికి పోలీసులు చేరుకుననేరు. ప్రభుత్వ వైఖరిని, పాలీసుల తీరును తీవ్రంగా ఖండించిన ఈటల రాజేందర్, గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని ఈటెలహెచ్చరించారు. ?ఎమ్మెల్యేకే రక్షణ లేకపోతే ఇక సామాన్య ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. - ?ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులను ప్రజలు సహించరు. హింసను క్షమించరు. - కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ బలపడడం జీర్ణించుకోలేకే ఇలాంటి దాడులు చేస్తున్నారు. - కాంగ్రెస్ నాయకుల రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఈ విధమైన దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గం.- దీనికి పూర్తి భాద్యత సీఎం రేవంత్ రెడ్డి వహించాలి. - మేము వెంకటరమణ రెడ్డి గారికి, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పూర్తి అండగా ఉంటాము.

## జేఎన్టీయుహెచ్ జేఏసీ నూతన డైరీ ఆవిష్కరణ



కూకట్పల్లి (ప్రజాబలం) ఫిబ్రవరి 21:2026 సంవత్సరానికి సంబంధించిన జేఎన్టీయుహెచ్ జేఏసీ నూతన డైరీనీ శనివారం నాడు విసి చాంబర్లో జేఎన్టీయుహెచ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్. కిషన్ కుమార్ రెడ్డి, రెక్టార్ సీనియర్ ప్రొఫెసర్ విజయ కుమార్ రెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్. వెంకటేశ్వర రావు చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఎన్టీయుహెచ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్. మంద రంజిత్ కుమార్ మాట్లాడుతూ. ఈ డైరీ సాధారణ పుస్తకం కాదని విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శక గ్రంథం అనీ రాష్ట్ర, జాతీయ స్థాయి విద్యా వ్యవస్థపై సమగ్ర సమాచారం ఇందులో పొందుపరచబడిందనీ, ఇంటర్ తర్వాత ఏ పరీక్ష ఏ కోర్సు ఎన్ని సంవత్సరాలు ఏ రాష్ట్రంలో, ఏ కాలేజీలో అందుబాటులో ఉంది? అన్న వివరాలు స్పష్టంగా అందించబడ్డాయనీ అలాగేజేఎన్టీయుహెచ్ అనుబంధ ఆటోనమస్ కళాశాలల పూర్తి వివరాలతో పాటు హైకోర్టు, గవర్నర్, సీఎం పేషీ, రాష్ట్ర మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లు మరియు ఎస్పీల వివరాలు కూడా చేర్చబడ్డాయనీ, ఒక వ్యక్తికి అవసరమైన సమగ్ర సమాచారం ఒకే డైరీలో అందుబాటులో ఉండేలా రూపకల్పన చేయడం జరిగిందనీ,గత నాలుగు సంవత్సరాలుగా నిరంతర విజయంతో జేఎన్టీయుహెచ్ జేఏసీ డైరీని ఆవిష్కరించడం జరుగుతుందనీ, మా అసోసియేషన్ అధ్యక్షులు జి. చెన్నయ్య, మెడి పాపయ్య సహకారంతో సంఘం మరింత బలంగా ముందుకు సాగుతోందనీ ఈ సందర్భంగా డాక్టర్. మంద రంజిత్ కుమార్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఉద్యోగులు, విద్యార్థులు ఎక్కడైనా అన్యాయాన్ని ఎదుర్కొంటే జేఎన్టీయుహెచ్ జాక్ కమిటీ ముందుంటుందనీహక్కుల కోసం పోరాటం ఆగదనీ,సమస్యల పరిష్కారంలో రాజీ ఉండదని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో జేఎన్టీయుహెచ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్. రంజిత్ కుమార్ మంద,స్టేట్ ప్రెసిడెంట్ బొజ్జ ప్రణయ భాస్కర్,స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొడెం సాయి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ మూడు నరేష్,జనరల్ సెక్రటరీ దిలీప్,ఈసీ సభ్యులు శ్రీనివాస్ బురుగుల వెంకటేశ్వర్లు, జేఎన్టీయుహెచ్ జేఏసీ అడ్వైసర్ సరల, ఎంఆర్పియస్ నాయకులు యాదగిరి, లాజర్, సుదర్శన్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు, యూనివర్సిటీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో పెరగనున్న 50 నియోజకవర్గాలు

తిరుపతి, ఫిబ్రవరి 21, కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనపై సంకేతాలు పంపింది. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పునర్విభజనకు సంబంధించి బిల్లును పార్లమెంటులో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో అసెంబ్లీ సీట్లు మరో 50 పెరిగే అవకాశం ఉంది. ఏడు పార్లమెంట్ స్థానాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.. నియోజకవర్గాల పెంపు అనేది రాష్ట్ర విభజన సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. విభజన చట్టంలోనే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాజకీయ అవకాశాలు పెంచుతామని స్పష్టంగా చెప్పారు. పాలనా వికేంద్రీకరణకు నియోజకవర్గాల పెంపు చేపడతామని చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు.ప్రస్తుతం రాష్ట్రంలో 175 అసెంబ్లీ? 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు.. 117 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా ఈ ప్రక్రియ జరిగింది అనేది ఒక విశ్లేషణ. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పట్లో తెలుగుదేశం పార్టీ కూడా బలంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపికి బలమైన స్థానాలను? విభజించి బలహీనపరిచారు అన్నది ఒక ఆరోపణ. ఇప్పుడు కూడా టిడిపి కూటమి రాష్ట్రంలో ఉంది. కేంద్రంలో టిడిపి బలమైన భాగస్వామ్య పక్షంగా ఉంది. ఇప్పుడు గాని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు తారుమారు అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.మొన్నటి ఎన్నికల్లో జనసేన 21, బిజెపి 10, మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే 164 సీట్లలో కూటమి గెలిచింది. అయితే పొత్తులో భాగంగా ఓ 50 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. టిడిపిలో ఇటువంటి వారి సంఖ్య అధికంగా ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపిలో సైతం చాలామంది ఎమ్మెల్యే సీట్ల ఆశావాహులు ఉన్నారు. ఎన్నికలకు ముందు, తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపి కూటమిలో చాలామంది నేతలు చేరారు. ఇప్పుడు వారందరికీ రాజకీయ అవకాశాలు కల్పించడం అనేది కష్టం. ఇటువంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా 50 అసెంబ్లీ స్థానాలు, ఏడు పార్లమెంటు సీట్లు పెరిగితే మాత్రం కూటమికి ప్లస్ గా మారుతుంది. ఇంకోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు.. విభజనతో మరింత బలహీనమవుతాయి. ఇలా ఎటు చూసుకున్నా నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపి కూటమికి ఎక్కువగా మేలు జరుగుతుంది.

# లోకేష్ ను హీరో చేస్తున్న జగన్



విజయవాడ, ఫిబ్రవరి 21, వైసీపీ అధినేత మాజీ సీయం జగన్ మోహన్ రెడ్డి తెలిసి అన్నారో లేక అనుకోకుండా అనేసారో తెలీదు కానీ తనకు లోకేష్ తోనే పోటీ అని తేల్చశారు. తాజాగా పెట్టిన ప్రెస్ మీట్లో ఆయన చంద్రబాబు, పవన్తో పాటు నారా లోకేష్పై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా అయన టార్గెట్ లోకేష్ వైపే నడిచింది. శ్రీలంకలో ఇండియా ఆడుతున్న ు20 వరల్డ్ కప్ మ్యాచ్ చూడడానికి ప్రత్యేకంగా లోకేష్ వెళ్ళాలా? ఇంట్లో కూర్చుని చూడకూడదా అంటూ ఆయన సెటైరికల్గా మాట్లాడారు. ఇప్పటికే లోకేష్పై వచ్చిన విమర్శలకు ఆయన స్వయంగా సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. సొంత డబ్బుతో మ్యాచ్ చూడడానికి వెళ్లినట్టుగానే చెప్పుకొచ్చారు లోకేష్. దానిపై మాజీ ముఖ్యమంత్రి హోదాలో జూ జగన్ ఇప్పుడు మాట్లాడడం ద్వారా సామాన్య జనాలకు ఒక మెసేజ్ ఇచ్చేసారు జగన్ అంటున్నారు ఎనలిస్ట్ లు. ఎందుకంటే సహజంగా జగన్ మాట్లాడే విధానం ఇలా ఉండదు అనేది వారి విశ్లేషణ.రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు మాత్రమే తన ప్రత్యర్థి అనీ వేరే ఎవరూ తనకు సమానులు కాదు అన్నట్టుగా జగన్ వ్యవహార శైలి ఉండేది. పాదయాత్ర చేసినప్పుడు గానీ సీయం అయ్యాక గానీ చంద్రబాబు టార్గెట్ గానే జగన్ మాటలు ఉండేవి. లోకేష్ ప్రస్తావన వచ్చినప్పుడు కూడా ముక్తసరిగా మాట్లాడి ఆ టాపిక్ ని పెద్దగా హైలైట్ చేసేవారు కాదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విషయంలోనూ ఆయన వ్యవహారశైలి అలానే ఉండేది. అధికారంలో ఉన్న ఐదేళ్ళలో ఒక్కసారి కూడా పవన్ ను పేరు పెట్టి పిలవ లేదు జగన్. కేవలం 'దత్త పుత్రుడు ' అని మాత్రమే ప్రస్తావించేవారు. కానీ తాజా ప్రెస్ మీట్ లో పవన్ కళ్యాణ్, లోకేష్ ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పోనీ పవన్ ఇప్పుడు ఉప ముఖ్య మంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి తనతో సమానుడు అని భావించినా లోకేష్ ను టార్గెట్ చేయడం తో భవిష్యత్ లో తనకూ లోకేష్ కూ మధ్య మాత్రమే అసలు సిసలు పోటీ అని ఫిక్స్ అయిపోయారా అనే అభిప్రాయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.అవునన్నా కాదన్నా ప్రస్తుతం ఏపీ ప్రభుత్వంలోనూ టీడీపీలోనూ నారా లోకేష్ అండ్ టీమ్ దే హవా అన్నది సుస్పష్టం. మొత్తం వ్యవహారాలు అన్నీ ఆయన టీమ్ చక్క బెడుతోంది. మోదీ, అమిత్ షా వంటి బీజేపీ అగ్ర నేతలు కూడా లోకేష్ తో వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్ టీడీపీ అధినేతగా లోకేష్ ని గుర్తిస్తున్నట్టుగానే ఉంది. టీడీపీ సోషల్ మీడియా యూనిట్స్ కూడా దాన్నే ప్రొజెక్ట్ చేస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా జూ జగన్ కూడా లోకేష్ నే తన పొలిటికల్ ప్రత్యర్థిగా డిసైడ్ అయిపోయిన దృశ్యం తెరపైకి వచ్చేసింది. ఇదివరకూ చంద్రబాబు ను టార్గెట్ చేసి జగన్ మాట్లాడుతూ ఉంటే పవన్ పై ఆయన సామాజిక వర్గ నేతలు లోకేష్ పై జగన్ తరువాతి స్థాయి నేతలూ విమర్శలు గుప్పించే వారు. ఇప్పుడు డైరెక్ట్ గా జగనే లోకేష్ ను టార్గెట్ చేయడం చూస్తుంటే పొలిటికల్ గా కింది స్థాయి కేడర్ కు లోకేష్ తన ఫ్యూచర్ పొలిటికల్ ప్రత్యర్థి అనే సంకేతం ఇస్తున్నారా అనే డౌట్స్ రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి.

## చింతకాయలకు ఫిక్స్...

శ్రీకాకుళం, ఫిబ్రవరి 21, టీడీపీలో సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ కు త్వరలోనే కీలక పదవి లభించే అవకాశాలున్నాయి. అయితే తొలుత విజయ్ ను రాజ్యసభ కు ఎంపిక చేయాలని భావించినప్పటికీ ఆ ఆలోచన విరమించుకున్నట్లు తెలిసింది. అయితే ఆయనకు కీలక పదవి రిజర్వ్ అయిందని, త్వరలోనే చింతకాయల విజయ్ సూపర్ పదవి దక్కబోతుందన్న సమాచారం ఉత్తరాంధ్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారుతున్నాయి. తెలుగుదేశం పార్టీ గతంలో మాదిరిగా కాకుండా ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులన్నీ ఎక్కువగా యువతకే ఇస్తున్నారు. మంత్రివర్గంలో కావచ్చు. రాజ్యసభ స్థానాల్లో కావచ్చు.. మరేదైనా సరే యువతకు అవకాశం ఇస్తున్నారు.పార్టీ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని సీనియర్ నేతలను పార్టీ బలోపేతం కోసం వ్యూహాలను, రోడ్ మ్యాప్ లను సిద్ధం చేయడానికే పరిమితం చేయనున్నారు. వారి అవసరాలను, సేవలను పార్టీ వరకే ఉపయోగించుకున్నారు. ఇది ఫిక్స్. ఇక వచ్చే పదవులన్నీ యువతతోనే ఎక్కువగా నిండిపోతాయన్నది కూడా వాస్తవం. నారా లోకేశ్ భావి నేతగా ఎదుగుతున్న తరుణంలో ఆయన తనకంటూ ఒక టీమ్ ను సెట్ చేసుకోవడం ఇప్పటికే ప్రారంభమయింది. ఇంకా కొనసాగుతుందికూడా. అది ఎమ్మెల్సీ పదవి కావచ్చు. రాజ్యసభ పదవి కావచ్చు.. మరేదైనా కావచ్చు. వచ్చే పదవుల్లో ఎక్కువగా యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నాయకత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.అందులో భాగంగా అయ్యన్న పాత్రుడు కుమారుడు విజయ్ ను ఎమ్మెల్సీని చేసి కేబినెట్ లోకి తీసుకోవాలని కూడా పార్టీ నాయకత్వం యోచిస్తున్నారని తెలిసింది. దేశ రాజకీయాలకంటే రాష్ట్ర రాజకీయాల్లోనే చింతకాయల విజయ్ ను ఉంచాలని భావిస్తున్నారు. అయ్యన్నపాత్రుడు కోరిక కూడా అదే. పార్టీ సోషల్ మీడియా విభాగంలో యాక్టివ్ గా పనిచేయడమే కాకుండా చింతకాయల విజయ్ నారా లోకేశ్ కు అత్యంత సన్నిహితుడు. సామాజికవర్గం కోటా కూడా ఇందుకు పనిచేస్తుంది. మంత్రి వర్గ విస్తరణలో చింతకాయల విజయ్ ను కేబినెట్ లో తీసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. విజయ్ పడిన కష్టానికి తగిన గుర్తింపు ఇవ్వడమే కాకుండా 2029 ఎన్నికలకు విజయ్ బీసీ కోటా కింద ఎంపికవుతారన్న టాక్ పార్టీ వర్గాల్లో బలంగా ఉంది.

## స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్
## తమిళ రాజకీయాల్లో సంచలనం

తమిళనాడు రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం , ప్రస్తుత ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. తమిళనాడు శాసనసభ సమావేశాల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ప్రత్యేకంగా కలిశారు. ఏఐఏడీఎంకే లో చోటు చేసుకున్న అంతర్గత విభేదాల వల్ల ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఓపీఎస్, తన సొంత వర్గంతో రాజకీయంగా ఒంటరయ్యారు. ఈ క్రమంలో అధికార పక్ష నేతను ఆయన కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తమిళనాడు శాసనసభలో రెండ్రోజుల పాటు జరిగిన తాత్కాలిక బడ్జెట్ చర్చల సందర్భంగా ఓపీఎస్ మద్దతుదారుడు, ఎమ్మెల్యే ఐయ్యప్పన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ము.క. స్టాలిన్ మళ్లీ విజయం సాధించి, తమిళనాడు ముఖ్యమంత్రి కావాలని ఆయన ఆకాంక్షించారు. అంతేకాకుండా, పురట్చి తలైవర్ ఎంజీఆర్, పురట్చి తలైవి అమ్మ జయలలిత ఆశీస్సులతో స్టాలిన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలపడం అందరినీ ఆశ్చర్యపరిచింది. శాసనసభ సమావేశాల ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్, అనంతరం మీడియాతో మాట్లాడారు. డీఎంకే ఐదేళ్ల పాలన అత్యంత అద్భుతంగా ఉందని కొనియాడారు. అందుకే ఉదయాన్నే ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపానని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి చూస్తే మళ్లీ డీఎంకే అధికారంలోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన విశ్లేషించారు. తన మద్దతుదారు ఐయ్యప్పన్ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు ప్రజల మనోగతానికి ప్రతిరూపమని ఓపీఎస్ సమర్థించారు.మీరు డీఎంకేలో చేరుతారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఓపీఎస్ స్పందిస్తూ.. కొంతకాలం వేచి చూడండి అని బదులిచ్చారు. ఈ సమాధానం ఆయన పార్టీ మారబోతున్నారనే అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, జయలలిత మరణం తర్వాత ఏఐఏడీఎంకే నుండి బహిష్కరణకు గురైన ఓపీఎస్.. 'ధర్మయుద్ధం' చేసినా, 'హక్కుల పునరుద్ధరణ కమిటీ' పెట్టి పోరాడినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఆయన ప్రధాన అనుచరులంతా ఒక్కొక్కరుగా ఇతర పార్టీల్లో చేరిపోగా, ఇప్పుడు ఆయన వద్ద మిగిలింది కేవలం ఎమ్మెల్యే ఐయ్యప్పన్ మాత్రమే. ఎటు వెళ్లాలో తెలియని స్థితిలో, రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ఓపీఎస్ డీఎంకే వైపు మొగ్గు చూపుతున్నారా అనే సందేహం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. దీనికి సంబంధించిన స్పష్టత అతి త్వరలోనే వచ్చే అవకాశం ఉంది.

# జెండాలు మోసిన వారికే అగ్రతాంబులం

కాకినాడ, ఫిబ్రవరి 21, జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ సభ్యత్వాలకు శ్రీకారం చుట్టారు. పార్టీ సభ్యత్వాల నమోదుతో జనసేన గ్రౌండ్ లెవెల్లో మరింత బలోపేతం అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పార్టీ సభ్యత్వాలు తీసుకున్న వారు జనసేన విజయాలకు పనిచేస్తారన్న విశ్వాసంతో ఉన్నారు. పల్లెలు, పట్టణాల్లో జనసేన క్యాడర్ పెరిగేందుకు ఇది ఉపయోగపడుతుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేన సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఇప్పటికే జనసేనకు కార్యకర్తల బలం ఉంది. అభిమానుల బలం కూడా జనసేన సొంతం. ఇక సామాజికవర్గం అండదండలు ఎటూ ఉన్నాయి. అదనంగా క్యాడర్ ను పెంచుకునేందుకు పవన్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు.స్థానిక సంస్థల ఎన్నికలతో జనసేన రాష్ట్రంలో బలపడాలని చూస్తుంది. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించాలంటే స్థానిక నాయకత్వం బలంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది. దీంతో పాటు జనసేనలో ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని చాలా మంది నిరాశలో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారిని ఎంపిక చేయడమే ధ్యేయంగా పనిచేయాలని, సుదీర్ఘ కాలం పార్టీలో వారి కున్న హిస్టరీని చూసి ఎంపిక చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారు కూడా ఉన్నారు. 2014 నుంచి పార్టీలోనే ఉంటున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిసింది.జనసేన ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి ఉందని జనసేనాని కూడా గుర్తించారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినప్పటికీ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అందరికీ న్యాయం చేయలేకపోయామని పవన్ కల్యాణ్ చెబుతున్నారు. కానీ పదవి రాని వారు మాత్రం తమకు జనసేనలో గుర్తింపు లేదని బాధపడుతున్నారు. అందుకోసమే ఇకపై ఒరిజినల్ జనసైనికులకు, వీరమహిళలకు నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇకపై ఏ పోస్టు భర్తీ అయినా నామినేటెడ్ పోస్టులను ద్వితీయ శ్రేణి నేతల్లో బాగా కష్టపడిన వారిని గుర్తించి, పార్టీ జెండా మోసే వారికే ప్రయారిటీ ఇచ్చేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. త్వరలోనే అది అమలులోకి తీసుకురానున్నారు. ఇకపై జెండా మోసిన వారికే జై కొట్టనున్నారు.

# జగన్ పై కేసుల్లేవ్...

విజయవాడ, ఫిబ్రవరి 21 వైసీపీ అధినేత వైఎస్ జగన్ విషయంలో కూటమి సర్కార్ ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. జగన్ ను ఎప్పుడు అరెస్ట్ చేస్తారని? ఆయనపై కేసులు ఎప్పుడు నమోదవుతాయని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న తెలుగు తమ్ముళ్లకు ఇప్పుడు సమాధానం దొరికిందంటున్నారు.

జగన్ పై కేసులు రాష్ట్రంలో నమోదయ్యే అవకాశాలు లేవు. అలాగే జగన్ ను అరెస్ట్ కూడా చేయడం జరగదు. ఇది ఎవరో చెప్పింది కాదు. టీడీపీ అగ్ర నేతల నుంచి వచ్చిన సమాచారం అంటున్నారు. జగన్ ను అరెస్ట్ చేసి, కేసులు నమోదు చేసి సానుభూతి ఆయనపై కురిపించడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదు. వచ్చే ఎన్నికల్లో కూటమి తిరిగి అధికారంలోకి రావాలంటే జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదన్నభావన పార్టీ అగ్రనాయకత్వంలో వ్యక్తమవుతుంది.అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకూ జగన్ పై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మద్యం కేసులో కానీ, మరొక కేసులో కానీ వైసీపీ నేతలను, జగన్ కు అత్యంత సన్నిహితులను అరెస్ట్ చేశారు.

ఒకరు కాదు... ఇద్దరు కాదు చాలా మంది జగన్ ముఖమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో పనిచేసిన వారిని సయితం అరెస్ట్ చేశారు. కేసులు నమోదు చేశారు. అయితే జగన్ మీద మాత్రం ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంపై టీడీపీ సోషల్ మీడియాలో పార్టీ కార్యకర్తలు పెద్దయెత్తున విమర్శలు చేస్తున్నారు. జగన్ విషయంలో ఇంత నాన్చుడు ధోరణి ఎందుకని? రెడ్ బుక్ లో జగన్ పేరు లేదా? అని ప్రశ్నిస్తున్నారుకానీ చంద్రబాబు, లోకేశ్ మాత్రం జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదని ఫిక్సయిపోయారు. జగన్ ను టచ్ చేస్తే సానుభూతి వస్తుందని, కూటమి ప్రభుత్వ విజయావకాశాలపై దెబ్బపడుతుందని ఢిల్లీ పెద్దలు కూడా సలహా ఇచ్చారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చేత అరెస్ట్ చేయించాలని కొన్నాళ్లు చేసిన ప్రయత్నాలకు కూడా బీజేపీ అగ్ర నేతలు అంగీకరించలేదని తెలిసింది. చంద్రబాబును అరెస్ట్ చేసి జగన్ ఎంత భారీ మూల్యం చెల్లించుకున్నాడో వారు గుర్తు చేసి వద్దని చెప్పి పంపుతున్నారట. అందుకే జగన్ విషయంలో కూటమి ప్రభుత్వం ఈ టర్మ్ లో వెళ్లే అవకాశం లేదన్నది సుస్పష్టం. జగన్ కు అనవరంగా సానుభూతి తెచ్చి పెట్టే ఆలోచనలకు కూటమి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

# హిందూపురంలో బాలయ్య సొంతిల్లు



అనంతపురం, ఫిబ్రవరి 21, హిందూపురం నియోజకవర్గం నందమూరి కుటుంబానికి ఒక కంచుకోట. దివంగత ఎన్టీ రామారావు నుంచి నేటి బాలకృష్ణ వరకు, ఈ గడ్డ నందమూరి వారసులకు ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తూనే ఉంది. అయితే, గత పదేళ్లకు పైగా ఇక్కడ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బాలయ్యపై ప్రతిపక్షాలు గురిపెట్టే ప్రధాన అస్త్రం 'స్థానికత'. ఈ విమర్శలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, హిందూపురంలోనే తన సొంత ఇంటి నిర్మాణానికి బాలకృష్ణ భూమిపూజ నిర్వహించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.హిందూపురం నియోజకవర్గం నుంచి 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న నందమూరి బాలకృష్ణ, గత 12 ఏళ్లుగా అక్కడ అద్దె ఇంట్లోనే నివసిస్తున్నారు. షూటింగ్‌లు ఉన్నప్పుడు హైదరాబాద్‌లో, రాజకీయ కార్యకలాపాల కోసం హిందూపురం వచ్చినప్పుడు ఆ అద్దె ఇంట్లో ఉండేవారు. అయితే, ఇవాళ ఆయన తన భార్య వసుంధర దేవితో కలిసి హిందూపురం సమీపంలోని వనం కాలనీలో సొంత ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.వనం కాలనీలోని సర్వే నంబర్ 445లో సుమారు 81 సెంట్ల విస్తీర్ణంలో ఈ భూమిని కొనుగోలు చేశారు. ఇది మూడు అంతస్తుల డూప్లెక్స్ తరహా భవనం కానుంది. ఇందులో నివాసంతో పాటు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు ప్రత్యేక హాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యేందుకు వీలుగా ఆఫీసు రూమ్‌లను నిర్మించనున్నారు. ఆధునిక హంగులతో పాటు ఒక చిన్న పార్క్, స్విమ్మింగ్ పూల్, పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చేలా గ్రీనరీని ప్లాన్ చేసినట్లు సమాచారం.వైసీపీ నేతలు గతంలో పలుమార్లు "బాలకృష్ణ చుట్టపుచూపుగా వచ్చి వెళ్తారు, ఆయనకు ఇక్కడ సొంత ఇల్లు కూడా లేదు" అంటూ విమర్శలు చేసేవారు. ముఖ్యంగా వైసీపీ స్థానిక నాయకులు ఆయనను 'నాన్-లోకల్'గా చిత్రించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు సొంత ఇల్లు నిర్మించుకోవడం ద్వారా, తాను కేవలం గెలిచి వెళ్ళిపోయే వ్యక్తిని కాదని, ఇక్కడే శాశ్వతంగా ఉంటానని బాలయ్య సంకేతాలిచ్చారు. హిందూపురంలో బాలయ్యకు భారీ అభిమాన గణం ఉంది. అయితే, నాయకుడు ఎప్పుడూ అందుబాటులో ఉండరనే చిన్న అసంతృప్తి కార్యకర్తల్లో ఉండేది. ఇప్పుడు సొంత ఇల్లు ఉండటం వల్ల ఆయన నియోజకవర్గంలో గడిపే సమయం పెరుగుతుందని, తద్వారా స్థానిక సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అభిమానులు భావిస్తున్నారు. కేవలం సినిమాల్లోనే కాకుండా, రాజకీయాల్లోనూ తాను సీరియస్ అని బాలయ్య నిరూపిస్తున్నారు. ఇటీవల ఆయన తన సొంత నిధులు రూ. 84 లక్షలు వెచ్చించి నియోజకవర్గంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం, ఇప్పుడు సొంత ఇల్లు కట్టుకోవడం వంటివి ఆయన నిబద్ధతను చాటుతున్నాయి.హిందూపురం నియోజకవర్గం అనంతపురం రాజకీయాల్లో అత్యంత కీలకం. ఇక్కడ పట్టు కోల్పోకుండా ఉండాలంటే భౌతికంగా అక్కడ ఉండటం అవసరమని బాలయ్య గుర్తించారు. ఈ సొంత ఇల్లు రాబోయే రోజుల్లో టీడీపీ రాజకీయాలకు ప్రధాన కేంద్రంగా మారే అవకాశం ఉంది.మొత్తానికి నందమూరి బాలకృష్ణ తీసుకున్న ఈ నిర్ణయం హిందూపురం ప్రజల్లో సానుకూల పవనాలను పెంచింది. "మా ఎమ్మెల్యే మా వాడు.. మా మధ్యే ఉంటారు" అనే భావన ప్రజల్లో బలంగా నాటుకునేలా ఈ గృహారంభం తోడ్పడుతుంది. కేవలం ఒక భవన నిర్మాణంగా కాకుండా, తన రాజకీయ ఉనికిని మరింత సుస్థిరం చేసుకునే దిశగా బాలయ్య వేసిన 'మాస్ స్టెప్'గా దీనిని అభివర్ణించవచ్చు.

# వాడపల్లి వెంకన్న దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో వేకువ జామునుండే పోటెత్తిన భక్తులు

కొత్తపేట చందన స్వరూపుడు స్వయంభూ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం పర్వదినం కావడం తో వాడపల్లిలో స్వయంభూ గా వెలసిన చందన స్వరూపుడు ఏడుశనివారాలు ఏడుప్రదక్షిణలు వెంకన్న బాబుగా ఖ్యాతి గాంచి అశేష భక్త జనంతో మొక్కులు తీర్చుకోవడానికి స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు.భక్తులు నాలుగు మాడవీధుల గుండా గోవింద నామస్మరణతో ఏడు ప్రదక్షిణలు అనంతరం స్వామిని దర్శించి వారి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ వృద్ధులకు, దివ్యాంగులకు, చంటి బిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనాలు ఏర్పాటు చేశామని క్యూ లైన్ లో ఉన్న భక్తులకు మంచినీరు, బిస్కెట్లు అదజేస్తున్నామని దర్శనానంతరం భక్తులకోసం ఏర్పాటు చేసిన ఉచిత అన్న ప్రసాదం స్వీకరించాలని ఆఅ కోరారు

# కాంగ్రెస్ అగ్నిపరీక్ష గా ఐదు రాష్ట్రాల ఎన్నికలు

పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు వచ్చే మా?డు నెలల్లో జరగనున్నాయి. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తామని అనుకున్న రాష్ట్రాల్లో కూడా ఓడిపోతోంది. రాను రాను ఆ పార్టీ పరిస్థితి దిగజారుతోంది. ఇలాంటి సమయంలో మరో ఐదు రాష్ట్రాల ఎన్నికలు వచ్చాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో ముఖాముఖి, కూటములుగా తలపడే పరిస్థితులు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ వరుస ఓటములతో సతమతమవుతున్న వేళ, ఈ ఎన్నికలు ఆ పార్టీ ఉనికికి ,ప్రతిపక్ష కూట ఐక్యతకు అగ్నిపరీక్షగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో మరోసారి తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ తన సంక్షేమ పథకాలు , బెంగాలీ అస్తిత్వంపై నమ్మకం పెట్టుకోగా, ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలను బీజేపీ తన ప్రధాన అస్త్రాలుగా మార్చుకుంది. ఇక్కడ కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి పోటీ చేస్తున్నప్పటికీ, ప్రధాన పోటీ మాత్రం టీఎంసీ-బీజేపీ మధ్యే ఉండేలా కనిపిస్తోంది. ముస్లిం ఓట్ల సమీకరణ ఇక్కడ గెలుపోటములను శాసించనుంది. మమతా బెనర్జీ ఎంతో నమ్మకంగా ఉన్నప్పటికీ.. బీజేపీ కూడా గెలిచి చూపిస్తామన్న ధీమాతో ఉంది. తమిళనాడులో అధికార డీఎంకే కూటమి బలంగా ఉన్నప్పటికీ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం రాకతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అన్నా డీఎంకే తన కోల్పోయిన వైభవాన్ని చాటుకోవాలని చూస్తుంటే, బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. కాంగ్రెస్ ఇక్కడ డీఎంకేపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. సీట్ల సర్దుబాటు విషయంలో డీఎంకే ఈసారి కఠినంగా వ్యవహరించే అవకాశం ఉండటంతో కాంగ్రెస్‌కు ఇది సవాలుగా మారింది. త్రిముఖ పోరులో డీఎంకేకు లాభం కలుగుతుందన్న అంచనాలు వస్తున్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని బ్రేక్ చేశారు. ఇప్పుడు వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవాలని ఎల్‌డిఎఫ్ చూస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కి ఇది చావో రేవో లాంటి ఎన్నిక. ఒకవేళ ఇక్కడ కూడా కాంగ్రెస్ ఓడిపోతే, జాతీయ స్థాయిలో ఆ పార్టీ నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింటుంది. అటు బీజేపీ కూడా క్రైస్తవ ఓటర్లను ఆకట్టుకుంటూ ఇక్కడ బలపడాలని చూస్తోంది. ప్రియాంకా గాంధీ వాయనాడ్ నుంచి ఎంపీగా ఉండటంతో గెలుపు సాధించడం ప్రతిష్టాత్మకంగా మారింది. అస్సాంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. అభివృద్ధి , హిందుత్వ నినాదాలతో బీజేపీ మూడోసారి అధికారంపై కన్నేసింది. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అంతర్గత కుమ్ములాటలతో ఇబ్బంది పడుతోంది. పైగా కీలక నేతలు బీజేపీలో చేరడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ. ఏఐయుడిఎఫ్ వంటి పార్టీలతో పొత్తులు కుదిరితేనే కాంగ్రెస్ ఇక్కడ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది, లేదంటే బీజేపీకి మార్గం సుగమం అవుతుంది. పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్‌సీ , బీజేపీ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. గతంలో ఇక్కడ కాంగ్రెస్ బలంగా ఉండేది, కానీ నేతల వలసలు ఆ పార్టీని బలహీనపరిచాయి. ఇక్కడ కూడా డీఎంకే మద్దతుతోనే కాంగ్రెస్ తన ఉనికిని చాటుకోవాల్సిన పరిస్థితి ఉంది. చిన్న రాష్ట్రం అయినప్పటికీ, ఇక్కడ గెలుపు కేంద్రంలోని అధికార పార్టీకి ప్రతిష్టాత్మకం. ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకం. కేరళలో అధికారం దక్కించుకోలేకపోతే, ఆ పార్టీ కేవలం కొన్ని చిన్న రాష్ట్రాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు, బెంగాల్ , తమిళనాడులో ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ, డీఎంకేలు గెలిస్తే, ఇండియా కూటమిలో కాంగ్రెస్ ప్రాధాన్యత తగ్గి, మమతా బెనర్జీ , స్టాలిన్ వంటి నేతలు జాతీయ నాయకత్వం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఐదు రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయ గమనాన్ని మార్చనున్నాయి.

# ఆ ఒక్కరూ ఎవ్వరు...

హైదరాబాద్, ఫిబ్రవరి 21, తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 16న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వీతో పాటు, బిఆర్ఎస్ సభ్యుడు కె.ఆర్. సురేష్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఈ రెండు స్థానాల కోసం పోటీ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ సీనియర్ నేతలను పట్టించుకోలేదని, ఈసారైనా పార్టీ విధేయులకు రాజ్యసభర స్థానాలను ఇవ్వాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పార్టీకోసం కష్టపడిన వారికి ఇప్పటి వరకూ ఛాన్స్ ఇవ్వకపోవడాన్ని తప్పు పడుతుంది. శాసనసభలో ప్రస్తుత పార్టీల బలాబలాలను పరిశీలిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను సునాయాసంగా కైవసం చేసుకునేలా కనిపిస్తోంది. రాజ్యసభ ఎన్నికల గెలుపు లెక్కల ప్రకారం, రెండు స్థానాలు ఖాళీగా ఉన్నప్పుడు ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 40 నుంచి 41 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న 64 మంది స్వంత ఎమ్మెల్యేలతో పాటు, ఇతర పార్టీల నుండి చేరిన వారితో కలిపి మొత్తం బలం 75 దాటడంతో, ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకోవడానికి అవసరమైన 82 ఓట్లకు కాంగ్రెస్ అత్యంత సమీపంలో ఉంది. మజ్లిస్ మద్దతు ఎటూ కాంగ్రెస్ పార్టీకే లభిస్తుంది. అందుకే రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందిప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో కొంత ఇబ్బందికరంగానే ఉంది. ఆ పార్టీకి ప్రస్తుతం ఉన్న 27 మంది ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఒక సీటు గెలవడానికి కూడా సరిపోదు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ ఓటింగ్ కు హాజరు కాకపోవచ్చు. పైగా, రెండో ప్రాధాన్యత ఓట్ల విషయంలోనూ అధికార పక్షానికే స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టినా పోటీ ఇవ్వడం కష్టమే. కాంగ్రెస్ అధిష్టానం ఒక సీటును జాతీయ స్థాయి నేతకు, మరో సీటును సామాజిక సమీకరణాల దృష్ట్యా రాష్ట్ర స్థాయి నేతకు కేటాయించే అవకాశం ఉంది. అయితే ఆ ఒక్క సీటు ఎవరికి అన్నది ఇంకా తేలలేదు. జగ్గారెడ్డి మాత్రం వీహెచ్ కు, కుసుమ కుమార్ లకు ఇవ్వాలంటూ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అయితే పార్టీ భవిష్యత్ ప్రయోజనాలు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అంటున్నారు. మరి ఆ ఒక్కరు ఎవరో?

# పరిషత్ లు రద్దు దిశగా అడుగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21, తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జడ్‌పీటీసీ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక పెను సంచలనంగా మారొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్రపై ప్రభుత్వం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. ఈ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన వెనుక మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సరైన అధికారులు కానీ, నిర్దిష్టమైన బాధ్యతలు కానీ లేవని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. కేవలం పదవులు ఉండి, నిధులు, విధులు లేకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగడం లేదని సర్కారు భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ స్థానాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమే ఉండదని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే కాకుండా తరచూ వచ్చే ఎన్నికల కోడ్ అడ్డంకులను కూడా నివారిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం వ్యవస్థల వల్ల పాలనాపరంగా పెద్దగా ఉపయోగం లేదని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడానికి ఫిబ్రవరి 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైంది. ఈ సమావేంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దుపై ప్రభుత్వం చర్చించే ఛాన్స్ ఉంది. ఈ లోగా ఈ అంశంపై ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని రేవంత్ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖను ఆదేశించింది. ఈ నివేదికలో ఈ వ్యవస్థల వల్ల జరుగుతున్న లాభనష్టాలు, రద్దు చేస్తే కలిగే పరిణామాలు , ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పొందుపరచనున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగంగా తీసుకుంటున్నా చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అనేది 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే తీరుగా అమలులోకి వచ్చింది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రాలు తమ ఇష్టానుసారం మూడు అంచెల వ్యవస్థలో మార్పులు చేయడం సాధ్యం కాదు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా, ఈ ప్రతిపాదన చట్టపరంగా, రాజకీయంగా ఎంత వరకు సాధ్యమవుతుందనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కేవలం రాష్ట్ర స్థాయిలో ఒక తీర్మానం చేయడం ద్వారా లేదా ఆర్డినెస్ తీసుకురావడం ద్వారా ఈ వ్యవస్థను రద్దు చేయడం కుదరదని ఒక వేళ కేంద్రం సహకరించకపోతే ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు ఈ వ్యవస్థలో సర్పంచులకు గ్రామంలో నిధులు, విధులు ఉంటాయి. కానీ ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా నిధులు గానీ, కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు సీటు గానీ ఉండటం లేదనే అసంతృప్తి ఉంది. ఒకే గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ మధ్య తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. అధికారాల విభజనలో స్పష్టత లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ సర్పంచులకు లేదు. వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఈ అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అయితే.. ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడ్డాయి. వీటిని రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం విన్నపం మాత్రమే చేయగలదు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులను రద్దు చేస్తే, పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగిసే అవకాశం ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉన్న ఈ మెట్లను తొలగిస్తే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలో ఉండి ఆ వ్యవస్థలోని భాగాలను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయనే వాదన కూడా పార్టీలో వినిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జెడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు.

కాబట్టి ఆయన ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తిస్తారా లేదా పాలనా సౌలభ్యం కోసం రద్దు వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. ఫిబ్రవరి 23న జరగబోయే కేబినెట్ భేటీలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ప్రభుత్వం ఈ నిర్ణయానికే కట్టుబడితే, ఇది తెలంగాణ రాజకీయాల్లో ఒక పెను మార్పుగా నిలుస్తుం

# మీర్పేట్ నంది హిల్స్ టీచర్స్ కాలనీలో మటన్, చికెన్ షాపులపై దాడులు కుళ్లిపోయిన మటన్ సీజ్




హైదరాబాద్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్పేట్ మున్సిపల్ సర్కిల్లో మీర్పేట్ నంది హిల్స్ టీచర్స్ కాలనీలో ఉన్న మటన్ మరియు చికెన్ షాపులపై వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా "సైదులు మటన్ ఒ చికెన్ సెంటర్"లో కుళ్లిపోయిన మటన్ ఫ్రిడ్జ్లో నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే సంబంధిత షాప్కు అవసరమైన లైసెన్స్ లేకపోవడంతో ఆ షాప్ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు.

ఇతర మటన్ మరియు చికెన్ షాపుల్లో కూడా సరైన లైసెన్సులు లేకపోవడం, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వంటి ఉల్లంఘనలు బయటపడటంతో జరిమానాలు విధించారు.

# కొత్త నేతలను వెతికే పనిలో కాంగ్రెస్

హైదరాబాద్, ఫిబ్రవరి 21, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి వరుసగా సాధిస్తున్న రాజకీయ విజయాలు, పాలనాపరమైన సంస్కరలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఏఐసీసీ అగ్రనాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రుల బృందం గురువారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగావచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఫోకస్ పెట్టినట్టు స్పష్టం చేసింది.

పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన వారిని ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించారు. తెలంగాణలో గత రెండేళ్లలో పార్టీ సాధిస్తున్న పురోగతిని సమీక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడిని ఢిల్లీకి పిలిపించిన అధిష్ఠానం, దాదాపు రెండు గంటలపాటు లోతైన చర్చలు జరిపింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మొదలు కొని ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ సాధించిన ఫలితాల పట్ల మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని ఖర్గే కొనియాడారు. ఇప్పటి వరకు అన్ని సానుకూలంగా సాగాయని, భవిష్యత్‌లో కూడా ఇదే పట్టుదలతో మంచి ఫలితాలు సాధించాలని నాయకత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే మంత్రులు తమ శాఖల పనితీరును, అమలు చేస్తున్న కీలక పథకాలను అధిష్ఠానానికి వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన తీరును మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదిక ఇచ్చారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, భూభారతి కార్యక్రమం ద్వారా చేపట్టిన భూసర్వే వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకం, దాని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. గిగ్ వర్కర్స్ కోసం ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త విధానం గురించి మంత్రి వివేక్ వివరించగా, ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా తీసుకురావాలని రాహుల్ సూచించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన సమ్మక్క- సారలమ్మ జాతర నిర్వహణపై రాహుల్ గాంధీ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ జాతర చరిత్ర, ప్రభుత్వం అక్కడ చేపట్టిన కొత్త నిర్మాణాల గురించి తెలుసుకున్న ఆయన, సమ్మక్క-సారలమ్మపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఒక సినిమా తీస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. జాత విజయవంతం కావడంపై అభినందిస్తూ తనను కూడా ఆహ్వానించి ఉంటే వచ్చే వాళ్లమని అన్నారు. పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై కూడా ఢిల్లీ వేదికగా చర్చ జరిగింది. ఇటీవల ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై విమర్శలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై అధిష్ఠానం ఆరా తీసింది. త్వరలోనే ఆయనను ఢిల్లీకి పిలిపించి మాట్లాడతామని అగ్రనేతలు అన్నట్టు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికల అంశంపై మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌తో విడిగా చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్చాలని హైకమాండ్ ఆదేశించింది. మరోవైపు కరీంనగర్ కార్పొరేషన్ ఫలితాల విషయంలో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ స్థానాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రశ్నించగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఇచ్చిన వివరణ పట్ల వారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రివర్గమంతా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఫామ్‌హౌస్ నుంచి పాలన చేయడం తప్పని, జాతీయ పార్టీ నాయకత్వానికి కలవడం ఎలా తప్పు అవుతుందని ఆయన ప్రశ్నించారు.

బీఆర్ఎస్ దిల్లీలో పార్టీ కార్యాలయం ఎందుకు నిర్మించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో అత్యధికం ఇప్పటికే అమలు చేస్తున్నామని, కేసీఆర్‌లా తాము ప్రజలను వదిలేసి పోయే రకం కాదని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మార్చి రెండో వారానికిల్లా నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పీసీసీ కార్యవర్గ పోస్టులు, జిల్లా, బ్లాక్ కమిటీలను కూడా అదే గడువులోగా భర్తీ చేస్తామని మహేష్ కుమారు గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పని చేయడం వల్లే స్థానిక సంస్థల్లో మంచి ఫలితాలు వచ్చాయని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వివరించారు.

# ఎమ్మెల్యేలనూ కూడగడుతున్నారా

హైదరాబాద్, ఫిబ్రవరి 21, తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవి ఆశించిన ఆయన, అది దక్కకపోవడంతో తన అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు. కేవలం అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా, ఒకానొక దశలో ఏకంగా ముఖ్యమంత్రి పదవినే సవాల్ చేసే స్థాయికి ఆయన వ్యాఖ్యలు వెళ్లడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. మంత్రి పదవి ఇవ్వకుంటే తానేంటో చూపిస్తానన్నట్లుగా ఆయన చేస్తున్న హెచ్చరికలు పార్టీలో అంతర్గత పోరును వీధికెక్కించాయి. రాజగోపాల్ రెడ్డి కేవలం మాటలకే పరిమితం కాకుండా, తెరవెనుక పావులు కదుపుతున్నారనే ప్రచారం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. తనకు అనుకూలంగా ఉన్న కొంతమంది ఎమ్మెల్యేలతో ఆయన నిరంతరం చర్చలు జరుపుతున్నారని, అవసరమైతే ఒక వర్గంగా విడిపోయే యోచనలో ఉన్నారని జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తన డిమాండ్లను నెరవేర్చుకోవడమే లక్ష్యంగా ఆయన ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ఆయన చేస్తున్న విమర్శలు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాజగోపాల్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తున్నా, అధిష్టానం ఇప్పటివరకు చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. అయితే, ఇప్పుడు పరిస్థితి చేతులు దాటిపోతోందని, ఆయన ఏకంగా ప్రభుత్వాన్ని బలహీనం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని సంకేతాలు అందడంతో హైకమాండ్ అప్రమత్తమైంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ వ్యవహారాన్ని ఇప్పటికే కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని అధిష్టానం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. రాజగోపాల్ రెడ్డిని పిలిపించి మాట్లాడతామని, ఆయన అభ్యంతరాలు ఏమిటో తెలుసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇది ఒక రకంగా రాజగోపాల్ రెడ్డికి ఇస్తున్న చివరి హెచ్చరికగా భావించవచ్చు. సర్దిచెప్పే ప్రయత్నాలు విఫలమైతే, పార్టీ లైన్ దాటి వెళ్తున్న నేతపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమనే సంకేతాన్ని పీసీసీ పంపింది. రాజగోపాల్ రెడ్డిని దారికి తెచ్చేందుకు అధిష్టానం త్వరలోనే ఒక స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రానుంది. రాజగోపాల్ రెడ్డి గతాన్ని పరిశీలిస్తే, ఆయన గతంలో కూడా పార్టీని వీడి మళ్ళీ తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన మళ్ళీ అదే బాట పడతారా లేక మంత్రి పదవి కోసం ఒత్తిడి తంత్రం మాత్రమే ఉపయోగిస్తున్నారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ ఆయన శాంతించకపోతే, ఆయనపై వేటు వేయడం ద్వారా ఇతరులకు గుణపాఠం చెప్పాలని రేవంత్ రెడ్డి వర్గం భావిస్తోంది. రాజగోపాల్ రెడ్డి వైఖరి పార్టీకి బలమా లేక బలహీనతా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. సీనియర్ నేతగా ఆయనకున్న బలాన్ని కాపాడుకుంటూనే, ముఖ్యమంత్రి పీఠాన్ని సవాల్ చేసే ధోరణిని అధిష్టానం ఎలా అణచివేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆయన దారికి రాకపోతే, కాంగ్రెస్ తనదైన శైలిలో ఆయనకు దారి చూపించే అవకాశం మెండుగా ఉంది.

# సచివాలయం తరలించవద్దంటూ గోరిజవోలు పాలెం గ్రామస్థుల నిరసన

గుంటూరు ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడు మండలం గోరిజవోలుగుంట పాలెం సచివాలయం ఎదుట మహిళలు నిరసనకు దిగారు. మాసచివాలయం మా గ్రామం లో ఉండాలి అని డిమాండ్ చేసారు. సచివాలయం మా గ్రామంలో ఉంటే అధికారులకు ఇబ్బంది ఏంటి అని ఆగ్రహం వక్తం చేసారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. సచివాలయం లో గ్రామస్తులు కి తెలీయి కుండా వస్తువులు తీసుకు వెళు తున్నారని మండిపడ్డారు.

# జీవన రెడ్డి దారెటు...



కరీంనగర్, ఫిబ్రవరి 21, జగిత్యాల కాంగ్రెస్‌లో సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు ఇప్పుడు కేవలం నియోజకవర్గానికే పరిమితం కావట్లేదు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక సంచలనంగా మారింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచిన ఒక సీనియర్ నేత.. నేడు సొంత పార్టీలోనే 'మనుగడ' కోసం పోరాడాల్సి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.తెలంగాణ రాజకీయాల్లో 'క్లీన్ ఇమేజ్' ఉన్న అతికొద్ది మంది నేతల్లో జీవన్ రెడ్డి ఒకరు. కానీ, ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితులు ఒక విధమైన రాజకీయ సంక్షోభాన్ని తలపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, కేడర్ గొంతుకగా నిలిచిన ఆయనకు.. తన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లోకి రావడమే పెద్ద దెబ్బగా మారింది.గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ చేతిలో జీవన్ రెడ్డి ఓడిపోయారు. అయితే, రాజకీయ సమీకరణాల్లో భాగంగా సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం జీవన్ రెడ్డి వర్గానికి మింగుడుపడలేదు. అప్పటి నుండి నియోజకవర్గంలో ప్రోటోకాల్ విషయంలోనూ, అభివృద్ధి పనుల విషయంలోనూ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా జెండాలు మోసిన కార్యకర్తలను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తుంటే ఇక మా ఉనికి ఎక్కడ? అనే ప్రశ్న జీవన్ రెడ్డి మద్దతుదారుల నుండి బలంగా వినిపిస్తోంది.ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు ఈ విభేదాలను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వర్గానికి కాకుండా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన నేతకే చైర్మన్ పీఠం అప్పగించడం అగ్నికి ఆజ్యం పోసింది. ఈ క్రమంలో జీవన్ రెడ్డి తన అనుచరులను స్వతంత్రులుగా పోటీ చేయించి గెలిపించుకోవాల్సి రావడం, ఆయన పడుతున్న ఆవేదనకు అద్దం పడుతోంది. "ఇంకెంత కాలం ఈ అవమానాలు భరించాలి? పార్టీలో నా భవిష్యత్తు ఏంటో అర్థం కావడం లేదు" అని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానించడం ఆయన మనస్తాపానికి నిదర్శనం. జీవన్ రెడ్డికి జరుగుతున్న అన్యాయంపై మరో సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. "కష్టకాలంలో పార్టీని వీడని వారికి న్యాయం చేయాలి" అని అధిష్టానాన్ని కోరారు.జగిత్యాల ప్రజల్లో జీవన్ రెడ్డి పట్ల అపారమైన గౌరవం ఉంది. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండే 'మనసున్న నేత'గా ఆయనకు పేరుంది. ఇప్పుడు ఆయన రాజకీయ మనుగడే ప్రశ్నార్థకం కావడం పట్ల స్థానికంగా తీవ్ర సానుభూతి వ్యక్తమవుతోంది. ఒకవేళ జీవన్ రెడ్డి గనుక పార్టీని వీడితే, జగిత్యాలలో కాంగ్రెస్‌కు ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకు భారీగా దెబ్బతినే ప్రమాదం ఉంది.ఒకవైపు అధికారంలో ఉన్న పార్టీకి ఎమ్మెల్యేల మద్దతు అవసరమే అయినప్పటికీ, దశాబ్దాల చరిత్ర ఉన్న సీనియర్ నేతలను దూరం చేసుకోవడం పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేత పార్టీ వీడడం అంటే అది కేవలం ఒక నాయకుడిని కోల్పోవడం కాదు, నమ్మకమైన కేడర్‌ను కోల్పోవడమే. వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, జీవన్ రెడ్డి ప్రత్యామ్నాయ దారి వెతుక్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కలుగజేసుకుని, ఈ సీనియర్ వర్సెస్ వలస నేతల గొడవకు స్వస్తి పలకకపోతే జగిత్యాల కోటలో హస్తం పార్టీకి పతనం తప్పకపోవచ్చు.

# చేవెళ్లలో వైఎస్ షర్మిలా

చేవెళ్ల వికారాబాద్ లో డీసీసీ ల శిక్షణ కార్యక్రమానికి వెళ్తున్న ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి కి చేవెళ్ల వద్ద స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ఘన స్వాగతం పలికారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి షర్మిలా పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# ఎస్ఎల్బీసీ ఘటనకు ఏడాది

# రేవంత్ పాలనకు పరాకాష్ట కేటీఆర్



హైదరాబాద్ రేవంత్ సర్కార్ చేతకాని పాలనకు పరాకాష్ట ఎస్ఎల్బీసీ దుర్ఘటన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎస్ఎల్బీసీ సొరంగం కుప్పకూలి ఏడాది కావొస్తున్నా కార్మికుల మృతదేహాలను వెలికితీయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. అయినవారిని కనీసం చివరిచూపు చూసే అవకాశం లేకుండా కార్మికుల కుటుంబాలకు మానసిక క్షోభకు గురి చేసిందని అన్నారు.

సంవత్సరం గడుస్తున్న మృతదేహాల వెలికితీతలో కానీ సొరంగం పనుల్లో కానీ ఎటువంటి పురోగతి లేకపోవడం రేవంత్ నిర్లక్ష్యానికి, చేతకానితనానికి నిదర్శనం. కాంగ్రెస్ నాయకులు కమీషన్లు, కాంట్రాక్టులు, వాటాలపై పెట్టే శ్రద్ధ, ఇకనైనా కార్మిక సంక్షేమం మీద, ప్రజా శ్రేయస్సు మీద పెడితే ఇటువంటి విషాదాలు పునరావృతం కావని అన్నారు.

# ఏసీబీ వలలో మంథని సబ్ రిజిస్టాటర్



పెద్దపెల్లి పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంథని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాసర్ల రాజేందర్, భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం స్వీకరిస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు.వివరాల్లోకి వెళ్తే, ఒక వ్యక్తి కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ రాజేందర్ రూ. 16,500 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. రాజేందర్ సూచన మేరకు, బాధితుడు ఆ డబ్బును రషీద్ అనే ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు.ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాలపై కేసు నమోదు

## రాజమండ్రి నుంచి గుంటూరు వస్తూ కార్లతో ర్యాలీ

## తమ నోటీసులను ఉల్లంఘించారంటూ అంబటి, జక్కంపూడిలపై కేసు నమోదు

## కేసును విచారిస్తున్న రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుపై మరో కేసు నమోదయింది. ఆయనతో పాటు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు. ఈ కేసును రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ బాజీలాల్ విచారణ చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే... 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీసులు అందించారు. కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించవద్దని, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై అధిక వాహనాలతో వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి, జక్కంపూడి రాజా తమ అనుచరులతో కలిసి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదయ్యాయి.

# తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దు.. అసాధ్యమే..!!

తెలంగాణలో స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయాలనే ప్రాథమిక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలంగాణ ప్రభుత్వ వర్గాలు లీకులు ఇస్తున్నాయి. ప్రస్తుతమున్న ఎంపీటీసీ , జడ్పీటీసీ వ్యవస్థల వల్ల అధికార యంత్రాంగం క్లిష్టంగా మారుతోందని, నిధుల వినియోగంలో జాప్యం జరుగుతోందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మధ్యంతర వ్యవస్థలను తొలగించి, గ్రామ పంచాయతీ సర్పంచులకు , జిల్లా స్థాయి యంత్రాంగానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పాలని ముఖ్యమంత్రి అనుకుంటున్నారు.

### పరిషత్‌లకు చాలా స్వల్పంగానే నిధులు..

ప్రస్తుతం మండల పరిషత్ , జిల్లా పరిషత్ సభ్యులకు కేటాయించే నిధులు చాలా పరిమితంగా ఉంటున్నాయి. అనేక సందర్భాల్లో ఎంపీటీసీలకు కనీస అధికారాలు కూడా ఉండటం లేదనే అసంతృప్తి వారిలో ఉంది. ఈ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా పాలనాపరమైన ఖర్చులను తగ్గించడమే కాకుండా, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మండల వ్యవస్థను కేవలం పరిపాలనా విభాగంగానే ఉంచి, రాజకీయ ప్రాతినిధ్యాన్ని గ్రామ, జిల్లా స్థాయిలకే పరిమితం చేయడం ద్వారా ద్వంద్వ పాలన కు స్వస్తి పలకాలని ప్రభుత్వం భావిస్తోంది.

### ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే సాధ్యం కాదు..

ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం అంత సులభమైన విషయం కాదు. భారత రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రకారం దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామ, మండల, జిల్లా స్థాయిలు అమలులో ఉండాలి. దీనిని మార్చాలంటే రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం , పార్లమెంటు ఆమోదం కూడా అవసరమవుతుంది. కేవలం రాష్ట్ర స్థాయి నిర్ణయంతో రాజ్యాంగబద్ధమైన ఈ వ్యవస్థలను రద్దు చేయడం సాధ్యం కాదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం మొగ్గు చూపితే, దీనిపై సుదీర్ఘమైన న్యాయ పోరాటం జరిగే అవకాశం ఉంది.

### కలిసి వచ్చే పార్టీలు ఉండవు..

పరిషత్‌ల రద్దు ప్రతిపాదనపై రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం కనిపిస్తోంది. స్థానిక సంస్థల్లో పట్టు సాధించాలనుకునే నాయకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే అవకాశం ఉంది. ముఖ్యంగా విపక్షాలు దీనిని ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణించే ప్రమాదం ఉంది. అందుకే రేవంత్ ఆలోచన చర్చకు కారణం అవుతుంది కానీ అమల్లోకి రాకపోవచ్చు..!!

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి : ఆత్మకూర్ అర్బన్ సీఐ మహేశ్వర్ రెడ్డి

ఆత్మకూరు ప్రతిఒక్క విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో మంచి ప్రతిభ చూపి ఉన్నతస్థాయి కి రావాలని ఆత్మకూర్ అర్బన్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ పట్టణంలోని ఐఎఐ స్టేడియం లో తైక్వాండో శిక్షణ తీసుకొనే విద్యార్థులు ఇటీవలే నంద్యాల పట్టణంలో జరిగిన 2నిట రాయలసీమ తైక్వాండో ఛాంపియన్షిప్ - 2026 శ్రీనీ పాల్గొని 16 మెడల్స్ సాధించారు.అందులో గోల్డ్ మెడల్ 8, సిల్వర్ 7, బ్రౌంజ్ 1 సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆత్మకూర్ సీఐ అభినందించారు.ఆంధ్రప్రదేశ్ నుండి వెలువడే ప్రతి నోటిఫికేషన్ లో క్రీడాకారులకు 3% రిజర్వేషన్ కలదని అందుకే ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే క్రీడలలో పాల్గొనాలన్నారు.నిత్యం క్రీడాకారులను అన్ని అన్ని విధాల ప్రోత్సాహిస్తున్న ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా ను అభినందించారు.రాష్ట్రం లో 8 రకాల క్రీడలను నిర్వహిస్తున్న ఏకైక స్టేడియం ఆత్మకూర్ ఐఎఐ స్టేడియం అని కొనియాడారు.తైక్వాండో శిక్షణ లో క్రీడాకారులకు మంచి శిక్షణ ఇస్తున్న తైక్వాండో స్టేడియం శిక్షకులు ఖాజా హుస్సేన్ మరియు సామన్న కిరణ్ మాస్టర్ లను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ కోశాధికారి పఠాన్. నాగుర్ ఖాన్, బ్యాట్మింటన్ క్రీడాకారులు కరిముల్లా పాల్గొన్నారు

# చోరీ సొత్తు స్వాధీనం

అనకాపల్లి జిల్లా మునగ పాక మం డలం, గంతవానిపాలెంకు చెందిన కరణం ఉమావతి ఇంట్లో చోరీకి గురైన 17.5 తులాల బంగా రాన్ని పోలీసులు నాలుగు రోజుల్లోనే స్వాధీనం చేసుకున్నారు. ఫిబ్రవరి 19 రాత్రి కొక్కిరపల్లి జంక్షన్ వద్ద అనకాపల్లికి చెందిన కోన రాజేష్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుండి 30.39 లక్షల విలువైన 16.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. ఈ కేసును పరవాడ డీఎస్పీ వి. విష్ణు స్వరూప్ పర్యవేక్షించారు.

# తూర్పు గోదావరి జిల్లాలో తుపాకీ బుల్లెట్ల కలకలం

రాజమండ్రి తూర్పు గోదావరి జిల్లా పంగిడి దగ్గర వెహికల్ చెకింగ్లో యూపీకి చెందిన అహ్మద్ సమీర్ హుస్సేన్ నుంచి 15 బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏడేళ్లుగా దేచెర్లలో నివాసముంటున్న సమీర్ హుస్సేన్ను అరెస్టు చేసారు. సమీర్ హుస్సేన్కు బుల్లెట్లు ఇచ్చిన మరో వ్యక్తి ఆదిత్య రాజ్ కోసం పోలీసులు గాలింపు జరుపుతున్నారు. ఆదిత్యరాజ్ దగ్గర ఆయుధాలు కూడా ఉన్నట్లు సమీర్ హుస్సేన్ వెల్లడించారు. ఇప్పటికే ఆదిత్యరాజ్పై రాజమండ్రి పీఎస్లో కేసులు వున్నట్లు సమాచారం..

# పలమనేరులో చిట్టీల పేరుతో కుచ్చుటోపీ..!

చిత్తూరు పలమనేరులో చిట్టీల భాగోతం బయటపడింది. సుమారు రూ.14 కోట్లకు దివాలా పిటిషన్ చిట్టీల వ్యాపారి వెంకట్రావు దాఖలు చేసారు. విషయం తెలిసి వెంకట్రావు ఇంటి వద్ద బాధితులు ఆందోళన కు దిగారు. ఒక్కొక్కరినీ రూ.లక్షల్లో మోసం చేసిన వెంకట్రావు నిర్వాకంతో 400 కుటుంబాలు రోడ్డున పడ్డామని బాధితుల ఆవేదన.

## భద్రాద్రి జిల్లాలో పులి సంచారం..

## భయాందోళనలో ఆయా గ్రామాల ప్రజలు...

భద్రాద్రి కొత్తగూడెం ఆళ్లపల్లి అటవీ రేంజ్ పరిధిలో పులి కదలికలు స్థానికులను కలకలం సృష్టిస్తున్నాయి.. ఆళ్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ సమీపంలోని చింతల గుంపు అటవీ పరిధిలో పెద్ద వెంకటాపురం ప్రధాన రహదారిపై పెద్దపులి పాదముద్రలను స్థానికులకు గుర్తించారు. వాటిని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆళ్లపల్లి అటవీశాఖ రేంజర్ కు గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ ఆఫీసర్ సురేష్ అటవీ శాఖ సిబ్బందితో ఆ గ్రామానికి చేరుకొని పాదముద్రలు సేకరించారు. అనంతోగు వైపు పెద్దపులి వెళ్లినట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్లపల్లి రేంజర్ కిరణ్ ఆధ్వర్యంలో పాదముద్రలను గుర్తించి పులి పాద ముద్రలుగా ధ్రువీకరించారు. సమీప గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రైతులు పశువుల కాపరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని అటవీశాఖ అధికారులు సూచించారు.

# బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇర్షాద్ పై దాడి హైదరాబాద్ కు తరలింపు

తాండూరు వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ 7వ వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ పై దాడి జరిగింది. అయనకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలించారు. కుటుంబ కలహాల నేపద్యమా.... రాజకీయ కోణంలో దాడి జరిగిందా అని అనుమానాల నేపథ్యంలో ఇది ముమ్మాటికి రాజకీయ దాడి అంటూ 7వ వార్డు కౌన్సిలర్ ఇర్షాధ్ ఆరోపించారు. అత్యవసర పరిస్థితులలో కూడా అంబులెన్స్ లో తాండూరు పోలీస్ స్టేషన్ కు వచ్చి స్టేట్మెంట్ ఇచ్చారు.

# ఖమ్మంలో రూ.4.50 కోట్ల క్యాంపు కార్యాలయం? ఆర్థిక మంత్రిపై విమర్శల వెల్లువ

భట్టి విక్రమార్క అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణల మధ్య, ఖమ్మం జిల్లాలో రూ.4.50 కోట్ల వ్యయంతో కొత్త క్యాంపు కార్యాలయం నిర్మాణం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే మధిరలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, అలాగే హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఖమ్మంలో మరో ప్రత్యేక క్యాంపు కార్యాలయం అవసరమా అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో కేవలం రూ.1 కోట్ల వ్యయంతో క్యాంపు కార్యాలయం నిర్మించగా, ప్రస్తుత నిర్మాణానికి రూ.4.50 కోట్ల ప్రజా ధనం ఖర్చు చేయడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనం ప్యాలెస్ తరహాలో నిర్మాణం జరుగుతోందని, ఇది ప్రజా ధన వినియోగంలో అసమతుల్యతను సూచిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న చర్చల ప్రకారం, ఖమ్మం జిల్లా తన ఆధిపత్యాన్ని చాటుకునే క్రమంలోనే ఈ నిర్మాణం చేపట్టారని, ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఒక రాజకీయ సందేశం ఇవ్వడానికే ఈ భవనం నిర్మాణమని ప్రచారం సాగుతోంది. అయితే ఈ వ్యాఖ్యలపై అధికారికంగా ఎటువంటి స్పష్టీకరణ వెలువడలేదు.ఇదే సమయంలో పెన్షనర్లకు పెండింగ్ బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలకు నిధుల కొరత ఉందని ప్రభుత్వం పేర్కొంటున్న నేపథ్యంలో, మంత్రిగారి కోసం భారీ వ్యయంతో భవనం నిర్మాణం చేపట్టడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.అలాగే, ఒక మంత్రికి ఇంత భారీ స్థాయిలో క్యాంపు కార్యాలయం నిర్మిస్తే, ఇతర మంత్రులు కూడా ఇలాంటి సదుపాయాలు కోరితే పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోందని సమాచారం.ఈ అంశంపై ప్రభుత్వం అధికారిక వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు.

# తెలంగాణ కేసరి 2026 పేరిట ఇండియా స్టైల్ రెజ్లింగ్ పోటీలు

తెలంగాణ కేసరి 2026 పేరిట ఇండియా స్టైల్ రెజ్లింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ , టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ యాదవ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ ఆదర్శ్ నగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇండియన్ స్టైల్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ జనరల్ గౌరవ్ రోషన్ లాల్ సచిదేవ్ తో కలిసి అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ కేసరి పోటీలలో వివిధ విభాగాలలో పురుషులు పాల్గొంటారని... తెలంగాణ కుమారి పేరిట తొలిసారి మహిళలకు కూడా రెజిలింగ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మే 7 నుండి 10 వరకు ఎల్బీ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని... సుమారు 5 వందల మంది రెజ్లర్లు పాల్గొంటారన్నారు. పురుషులలో మొదటి బహుమతి గా మూడు లక్షలు నగదుతో పాటు వెండి గదా ను బహుకరిస్తామని , మహిళలలో మొదటి బహుమతి లక్ష రూపాయల నగదు పురస్కారాన్ని అందిస్తామన్నారు. ఈ పోటీలకు ముఖ్యమంత్రి తో పాటు క్యాబినెట్ మంత్రులు అందరూ వస్తారని అంజన్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బిజెపి కాంగ్రెస్ నాయకుల మధ్య హై డ్రామా..

ప్రకాశం జిల్లా ఒంగోలులోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బిజెపి నాయకుల కాంగ్రెస్ నాయకుల మధ్య హైడ్రామా నెలకొంది. దీనికి ఒంగోలు తాలూకా పోలీసులు బిజెపి పక్షాన నిలబడి కాంగ్రెస్ నాయకుల పై దాడి చేశారని ఎన్ ఐ సి యు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో భాగంగా శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బిజెపి నాయకులు రాహుల్ గాంధీ డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి చొరబడే ప్రయత్నం చేస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ నేషనల్ యూత్ నాయకులు బయటకు వచ్చి పీఎం మోడీ కాంప్రమైజ్ అంటూ నినాదాలు చేస్తూ బయటికి వచ్చే
క్రమంలో తాలూకా సిఐ కాంగ్రెస్ పార్టీ యువజన విద్యార్థి సంఘం నాయకుల పై దాడి చేసి కార్యాలయంలో నిర్బంధించారు. అనంతరం బిజీ వైపి నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను తగలబెట్టే ప్రయత్నం చేయగా పోలీసులు ఉన్నారు. ఇదంతా హై డ్రామా అని అక్కడి స్థానికులు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు కాంగ్రెస్ కార్యాలయం ఎదుట వున్న తాలూకా సిఐను "మా వాళ్ళను ఎందుకు కొట్టారని".. బిజెపి నాయకులకు మీరు అండగా ఉన్నారని ప్రశ్నించారు. దీంతో సీఐ బదులిస్తూ మిమ్మల్ని ఎవరు బయటకు రమ్మన్నారని.. మీరు బయటకు వస్తే మేము చూస్తూ ఊరుకోవాలా అంటూ కాంగ్రెస్ విద్యార్థి సంఘ
నాయకులకు బదులిచ్చారు.

# వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమ్మె

ముమ్మిడివరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల (ఒఖ ఖంఅూ) ఉద్యోగులు తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మెబాట పట్టారు. నియోజకవర్గం లో ప్రాదమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో పని చేస్తున్న ఉద్యోగులంతా ముమ్మిడివరంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద శిబిరం ఏర్పాటు చేసి నిరవధిక దీక్ష ప్రారంభించారు. పీఆర్సీ ప్రకారం వేతన సవరణలు అమలు చేయాలి. దీర్ఘకాలంగా పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందిని శాశ్వతీకరించాలి. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ మరియు గ్రాట్యుటీ ప్రయోజనాలు కల్పించాలి. ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ పథకాలను పూర్తిగా అమలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. సేవా నియమావళిని స్పష్టంగా రూపొందించి అమలు చేయాలంటూ, తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేసి ఆమరణ నిరహారదీక్ష చేపడతామని ఉద్యోగులుహెచ్చరించారు..

# గ్రామ పంచాయితీలకు రూ.387 కోట్లు విడుదల

హైదరాబాద్ తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా 3వ విడతగా రూ. 387.53 కోట్లు విడుదల కావడంతో గ్రామీణ సంస్థలకు భారీ ఊరట లభించింది. ఇటీవల పంచాయతీ ఎన్నికలు ముగియడంతో పెండింగ్ గ్రాంట్ల విడుదలకు లైన్ క్లియర్ కాగా, ఇప్పటివరకు మూడు విడతల్లో కలిపి మొత్తం రూ.1,034.42 కోట్లు రాష్ట్రానికి జమయ్యాయి. ఈ నిధులను ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతుల కల్పన వంటి అత్యవసర పనులకు వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## శానిటరీ వర్కర్లకు యూనియన్ కార్డులు అందజేత

సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ శానిటరీ వర్కర్స్ యూనియన్ ( ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాల శానిటరీ వర్కర్లకు ఏఐటియుసి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్ గుర్తింపు కార్డులను శనివారం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఆవరణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస పనికి, కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి వల్లెం లక్ష్మీచెన్నకేశవరావు, యూనియన్ నాయకురాలు భారతి, భవాని, మార్తమ్మ, దేవి, చుక్కమ్మ, రత్నకుమారి, శేఖరు తదితరులు పాల్గొన్నారు.

## లోన్ యాప్ వేధింపులకు యువకుడి బలి... బంధువుల ఆరోపణలు!

లోన్ యాప్ వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన కృష్ణా జిల్లా మచిలీపట్నంలో చోటు చేసుకుంది. కాసానిగూడెంకు చెందిన ఈడే గిరీశ్ కుమార్ బెల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగం చేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం ప్రైవేట్ లోన్ యాప్ ద్వారా రుణం తీసుకున్నాడు. అయితే తీసుకున్న రుణం కట్టలేకపోవడంతో వేధింపులు మొదలయ్యాయి. దాంతో గిరీశ్ కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వన్ మ్యాన్ కమిటీ...చంద్రబాబు కొత్త నాటకమే

తిరుమల లడ్డూ వ్యవహారం పై ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న వన్ మ్యాన్ కమిటీ...చంద్రబాబు కొత్త నాటకమేనని టీటీడీ మాజా చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. సుప్రీంకోర్టునూ అవహేళన చేసేలా చంద్రబాబు చర్యలు వున్నాయని అన్నారు. సీబీఐ దర్యాప్తుతో ఆటలు సాగకే మరో డ్రామాకు తెర తీసారని అన్నారు. మమ్మల్ని దోషులుగా చిత్రీకరించే కుతంత్రం జరుగుతోంది.

# మంగళంపేటలో ధ్వజారోహణంతో ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి, 2026, ఫిబ్రవరి 21. ఫిబ్రవరి 21 నుండి మార్చి 02 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలుపులిచర్ల మండలం మంగళంపేటలో ప్రసిద్ధిచెందిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి.ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు, గరుడ ధ్వజపటాన్ని ఆలయ ప్రదక్షిణగా తీసుకొచ్చారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 08.00 నుండి 09.00 గంటల మధ్య ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభంపైకి అధిష్టింపచేశారు. కాగా, రాత్రి పెద్ద శేష వాహనంపై స్వామివారు విహరించి భక్తులను ఆశీర్వదించనున్నారు.

ఫిబ్రవరి 21 నుండి మార్చి 02 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు

ఫిబ్రవరి 21 నుండి మార్చి 02 వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం 08.00 గం.ల నుండి 09.00 గం.లకు, సాయంత్రం 06.00 గం.ల నుండి 08.00 గం.ల వరకు వాహన సేవలు జరుగనున్నాయి.శనివారం సాయంత్రం 06.00 గం.లకు స్వామి వారు పెద్ద శేష వాహనంపై విహరించనున్నారు.

వాహన సేవల వివరాలుఫిబ్రవరి 22వ తేదీ ఉదయం చిన్న శేష వాహనం, సాయంత్రం హంస వాహనం, 23వ తేదీ ఉదయం ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం సింహ వాహనం, 24వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమంత వాహనం, 25వ తేదీ ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం 06.00 గం.లకు కల్యాణోత్సవం, రాత్రి 08.00 గం.లకు గరుడ సేవ, 26వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్ర ప్రభ వాహనం, 27వ తేదీ ఉదయం మోహినీ ఉత్సవం, సాయంత్రం గజ వాహనం, 28వ తేదీ ఉదయం 08.00 గం.లకు రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, మార్చి 01వ తేదీన ఉదయం 11.00 గం.లకు చక్ర స్నానం, రాత్రి 07.00 గం.లకు ధ్వజావరోహణం, మార్చి 02వ తేదీ ఉదయం 09.00 గం.లకు పుష్పయాగ మహోత్సవం చేపడుతారు.

# "కాకాణి కి మరోసారి పోలీసులు నోటీసులు

నెల్లూరు సాయిరాం నగర్ లోని మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి నివాసానికి పోలీసులు చేరుకుని మరోసారి నోటీసులు అందజేశారు. – ఫిబ్రవరి 24వ తేదీ నెల్లూరు రూరల్ డిఎస్పి కార్యాలయంలో విచారణకు హాజరు కావలసిందిగా నోటీసులు జారీ చేచేశారు.. ఫిబ్రవరి 14వ తేదీ నాడు కోవూరు స్టేషన్ కి రావాలని నోటీసులు జారీ చేసిన పోలీసులు, అటు పిమ్మట 14వ తేదీ రావాల్సిన అవసరం లేదని, 19 తేదీ నాడు ఇంటి దగ్గరే విచారిస్తామని, రెండోసారి నోటీసులు అందజేశారు ....– ఫిబ్రవరి 19 తేదీ నాడు కాకాణి ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎదురుచూసినా, పోలీసులు రాకపోవడంతో తన రోజువారి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మరలా పోలీసులు ఈరోజు (20 తేది) నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంకి విచారణ రావలసిందిగా నోటీసులు అందజేశారు..పోలీసులు అందజేసిన నోటీసులలో ఒకవేళ 24వ తేదీ ఏదైనా పనులు ఉంటే, మరొక తేదీ సూచించమని కాకాణి ని పోలీసులు కోరారు.– కాకాణి ఇప్పటికే తాను పోలీస్ కేసులకు భయపడేది లేదని, విచారణకు హాజరవుతానని, ప్రకటించిన విషయం తెలిసిందే.

## హెరిటేజ్ సంస్థ పై వైకాపా ఆరోపణలు సరికావు డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు హెరిటేజ్ ఫుడ్స్ సంస్థను లక్ష్యంగా చేసుకుని సాక్షి మీడియా వైసీపీ వర్గాలు చేస్తున్న ఆరోపణలు సరైనవి కాదని అందుకే వారు చేస్తున్న దుష్ప్రచారంపై హెరిటేజ్ సంస్థ ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వేసిందని డీసీసీబీ చైర్మన్మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం బద్వేల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసును విచారించిన ఢిల్లీ హైకోర్టు, సంబంధిత ప్రచారాన్ని ఫేక్ ప్రచారం అని గుర్తించినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వార్తలు, సోషల్ మీడియా పోస్టుల లింకులను 24 గంటల్లోగా తొలగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.ఒక ప్రముఖ సంస్థపై ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదని అన్నారు. వైసీపీ నేతలు హెరిటేజ్ ఫుడ్స్ పేరును ఉపయోగించి రాజకీయ లాభం కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం భావ్యం కాదని విమర్శించారు.సంస్థ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం బాధాకరమని, ఇలాంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కోర్టు ఆదేశాలను గౌరవించి వెంటనే సంబంధిత వార్తలు, పోస్టులు తొలగించాలని ఆయన కోరారు.హెరిటేజ్ ఫుడ్స్ వంటి సంస్థలు రైతులతో అనుసంధానంగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్నాయని, వాటిపై రాజకీయ ఆరోపణలు చేయడం విచారకరమని చైర్మన్ పేర్కొన్నారు విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు చెరుకూరి రవికుమార్ డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్ జయరాం రెడ్డి రైల్వే కాంట్రాక్టర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ గా రవీంద్రారెడ్డి నియామకం

కొత్తపల్లి:వైసీపీ పార్టీ అధ్యక్షులు ఎబ జగన్మోహనరెడ్డి అదేశాల ప్రకారం రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ గారు శ్రీ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గారి, నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త గారి ఆశీస్సులతోనంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామము నకు చెందిన రవీంద్రారెడ్డిని వైసీపీ రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదలచేసారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ నాపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి ఎబ జగన్మోహనరెడ్డి ఎందుకు సహకరించిన యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ కృతజ్ఞతలు తెలియజేసారు. పార్టీ బలోపేతానికి కృషితో అందరి సహకారంతో ముందుకు తీసుకెళ్తానని అయన తెలిపారు.

# గోదావరి జలాలతో డెల్టా రైతాంగానికి రెండు పంటలకు నీరు : ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము

**టూరులో రూ.23.75 లక్షలతో ఇరిగేషన్ రెగ్యులేటర్ నిర్మాణ పనులకు... శంకుస్థాపన చేసిన ఎంపీ,ఎమ్మెల్యే**

**సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో.... పోలవరం పనులు తుది దశకు చేరుకున్నాయి: ఎంపీ బాలసౌరి**

**రైతులకు స్థిరమైన ఆయకట్టు అందించేందుకు విరివిగా ఇరిగేషన్ ప్రాజెక్టులు: ఎమ్మెల్యే రాము**

గుడివాడ రూరల్ ఫిబ్రవరి 21 సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పోలవరం నిర్మాణ పనులు చేరుకున్నాయని ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గోదావరి జలాలతో రైతాంగానికి రెండు పంటలకు అందిస్తామని అన్నారు.

గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామంలో రూ.23.75 లక్షల నిధులతో పునర్ నిర్మిస్తున్న ఇరిగేషన్ రెగ్యులేటర్ నిర్మాణ పనులను మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలసౌరి, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము భూమి పూజ నిర్వహించి శనివారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఎంపీ,ఎమ్మెల్యేలకు మోటూరు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని భగీరథ మహర్షి విగ్రహానికి పూజలు చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ వల్లభనేని బాలసౌరి మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలను పరిష్కరించడం, రైతాంగానికి స్థిరమైన అయుకట్టు అందించడమే లక్ష్యంగా విరివిగా ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నామని అన్నారు.

పోలవరం నిర్మాణంతో డెల్టాకు సమృద్ధిగా గోదావరి జలాల రాకతో ,రైతాంగం రెండు పంటలతో సుభిక్షంగా ఉంటారని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గుడివాడ నియోజకవర్గంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ కూటమికి మద్దతుగా నిలిచిన మోటూరు గ్రామ అభివృద్ధికి.... కూటమి ప్రభుత్వ హయాంలో రూ.1.10 కోట్లతో అభివృద్ధి పనులు చేసామన్నారు. ఏడేళ్లుగా ప్రయత్నిస్తున్న ఇరిగేషన్ రెగ్యులేటర్ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వంలో ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో ఒక్క మోటూరు గ్రామంలోనే కాకుండా పరిసర గ్రామాల ప్రజలకు త్రాగునీటి, సాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ వేసవి సీజన్లో మోటూరు త్రాగునీటి చెరువును అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు అభివృద్ధి పనులకు ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు అడ్డుపడడం బాధాకరమన్నారు. పార్టీలకంటే గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని కలిసి ఉంటే ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చని, ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గ ప్రజల సమస్యలపై వెళ్లిన ప్రతిసారి తక్షణమే స్పందిస్తూ, సమస్యలను పరిష్కరిస్తున్న సోదరుడు ఎంపీ బాలసౌరీకు గుడివాడ ప్రజల తరఫున ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు తెలిపారు.

ఏపీ ఎస్.డబ్ల్యూ.సి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్,టిడిపి అధ్యక్షుడు వాసే మురళి,ఎంపీపీ గద్దె పుష్ప రాణి, ఎండిఓ విష్ణు ప్రసాద్, మండల సర్పంచ్ కూరగంటి పద్మ, ఎంపీటీసీ గొర్రె వరలక్ష్మి,పిఎసిఎస్ చైర్మన్ చీకటి శేషగిరి రావు,కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, జనసేన నాయకులు చందు రెడ్డి, ఇరిగేషన్ డిఈ భరత్, బీసీ చైర్మన్ నానారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చీకటి శేషగిరిరావు, పార్టీ నాయకులు గొర్రె రంగ, గంటా బాలాజీ, చలమలశెట్టి సాయి, గంటా చైతన్య, యార్లగడ్డ తేజ, గంట లక్ష్మణ్, గండికోట పాండు, కటారి ప్రసాదు, కాట్రగడ్డ రాజేష్, మువ్వా నాగేశ్వరరావు, మానేపల్లి సురేష్,ఇరిగేషన్,మండల పరిషత్,పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వ హయంలో రికార్డులు ట్యాంపర్ చేసిన ఎంఆర్ఓ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి :

### శాసనసభలో డిమాండ్ చేసిన ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం రాష్ట్ర శాసనసభలో రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ల శాఖపై జరిగిన చర్చలో గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడారు. గన్నవరం, విజయవాడ రూరల్ మండలాల్లో భూముల అన్యాక్రాంతంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో నరసింహారావు అనే ఎంఆర్ఓ రెండు మండలాల్లో ఉంటూ రికార్డులను ట్యాంపర్ చేశారని, లక్షల ఓట్లు ఉన్న ప్రాంతంలో భారీగా దోపిడీ జరిగిందని ఆరోపిస్తూ ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విజయవాడ రూరల్ మండలంలో విలేజ్ హెల్త్ సెంటర్లు కట్టడానికి కూడా స్థలం లేనంతగా ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లలో కలిసిపోయాయని వాపోయారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దీనిపై విచారణకు ఆదేశించినా కమిటీ పని ప్రారంభించలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

## మూగ, చెవుడు చిన్నారికి రూ 7 లక్షల సాయం

విజయవాడ మనీ అందరికీ ఉంటుంది.. కానీ ఆపన్న హస్తం అందించే మనస్సు మాత్రం కొంతమందికే ఉంటుంది. అటువంటి వారిలో పవర్ మెక్ ప్రాజెక్టు సంస్థ అధినేతలు సజ్జా లక్ష్మీ, కిషోర్ ముందు వరుసలో ఉంటారు. ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాల ద్వారా చేయూతను ఇచ్చిన వారు.. తాజాగా చెవుడు, మూగ తో బాధ పడుతున్న ఓచిన్నారి కి వినిపించేలా, మాటలు తెప్పించేందుకు తమ వంతు బాధ్యతగా 7లక్షల రూపాయలను సాయం అందించారు. విజయవాడ మాచవరం పోలీస్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న దిలీప్ కుమార్ కు పాప, బాబు. ఇద్దరికీ వినికిడి లోపం కారణంగా మాటలు కూడా రాలేదు. తనకు ఉన్న ఆస్తిని అమ్మి అప్పటికే పాపకు ఆపరేషన్ చేయించాడు. బాబుకు కూడా అదే కష్టం రావడంతో.. తల్లిడిల్లిపోయాడు. చికిత్స కోసం తోటి పోలీసులు కొంతవరకు సాయం అందించారు. అయితే ఆపరేషన్ కు 16లక్షలు అవసరం కావడంతో దాతల సాయం కోసం విజ్ఞప్తి చేశారు. ఈ విషయం తెలుసుకున్న విజయవాడ సెంట్రల్ ఏసీపీ దామోదర్ వెంటనే స్పందించారు. పవర్ మెక్ ప్రాజెక్టు సంస్థ అధినేతలు సజ్జా లక్ష్మీ, కిషోర్ లను కలిసి దిలీప్ కు వచ్చిన కష్టం గురించి వివరించారు. ఆ బాబు కి అవసరమైన ఆపరేషన్ కు సాయం అందించాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన వారు ఆ బాబు కి ఆపరేషన్ చేయించేందుకు ఏడు లక్షల రూపాయలు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మాట ఇవ్వడమే కాకుండా నేడు శనివారం ఏసీపీ దామోదర్ సమక్షంలో దిలీప్ కుటుంబ సభ్యులకు సజ్జా లక్ష్మీ ఏడు లక్షల రూపాయల చెక్ ను అందచేశారు. ఏసీపీ గారి ద్వారా తన కష్టం తెలుసుకుని ఏడు లక్షల రూపాయల సాయం అందించిన సజ్జా లక్ష్మీ, కిషోర్ లకు దిలీప్ కృతజ్ఞతలుతెలిపారు. ఏసీపీ దామోదర్ మాట్లాడుతూ పవర్ మెక్ ప్రాజెక్ట్ సంస్థ ద్వారా కిషోర్, లక్ష్మీ లు చారిటబుల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి అనేక మందికి ఆపన్న హస్తం అందిస్తున్నారని, దిలీప్ పరిస్థితి తెలుసుకుని వెంటనే స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్న డి.ఎస్.పి ప్రమోద్

ఆళ్లగడ్డ రంజాన్ మాసం రెండవ రోజు శుక్రవారం ఉపవాస దీక్షల విరమణ అనగా ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాత మసీదు జామియా మర్కస్ మస్జిద్ లో డిఎస్పి ప్రమోద్ ముస్లిం సోదరులతో కలిసి ఆళ్లగడ్డ మండల ప్రభుత్వ ఖాజీ మతపెద్ద పాత మసీదు ఇమామ్ మహమ్మద్ జాఫర్ సాదిక్ మరియు ఆళ్లగడ్డ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి అమీర్ భాష కౌన్సిలర్ ఎస్ హుస్సేన్ భాష ఏఎన్ఆర్ చికెన్ సెంటర్ హుస్సేన్ భాష గౌస్ హజరత్ హకీం మహబూబ్ బాషా ఈనాడు సర్దార్ భాయ్ ట్రెజరర్ పండ్లమండి షర్బుద్దీన్ రెహమాన్ చాక్లెట్ భాష పాల్గొని డిఎస్పి కి సన్మానం చేసి ప్రార్థనలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి ప్రమోద్ మాట్లాడుతూ ముస్లిం సోదరులందరికీ రంజాన్ మాసపు శుభాకాంక్షలు తెలుపుతూ రంజాన్ మాసం ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన మాసం ఈ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలో దానధర్మాలు ఐదు పుట్ల నమాజులు ఖురాన్ చదవడం ప్రత్యేకత ప్రత్యేకత అన్నారు. ఆళ్లగడ్డలో అన్ని మతాలవారు హిందూ,ముస్లిమ్స్ మరియు క్రిస్టియన్స్ సోదరా భావంతో ఉండడం పండగ చేసుకోవడం చాలా సంతోషం అన్నారు ముస్లిం సోదరులందరూ స్నేహభావంతో సమాజ హితంతో మెలగాలని సూచించారు ఈ సందర్భంగా మత పెద్ద మహమ్మద్ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ రంజాన్ మాసం అల్లా ఇచ్చిన ఒక గొప్ప వరం ముస్లిం సోదరులకు అలాగే దివ్య ఖురాన్ గ్రంథం ఈ మాసంలో ఉద్భవించడం జరిగిందన్నారు రంజాన్ మాసం లో ముస్లింలు ఉపవాసాలు వలన ఆత్మ శుద్ధి నియంత్రణ దైవచింతన క్రమశిక్షణ సేవాభావము తల్లిదండ్రుల యందు బంధువుల యందు మంచిగా మెలగడం భావాలు కలుగుతాయి అన్నారు.

## గడ్డి మందును నిషేధించాలి

హైదరాబాద్ పెస్టిసైడ్ కంపెనీలు పోటీ పడి గడ్డి మందును తయారు చేశాయి. పారా క్వాడ్ డై క్లోరైడ్ అనే విష పూరిత మందుకు విరుగుడు మందు లేదు, కరీంనగర్ జిల్లా ఆసుపత్రికి ప్రతి నెల గడ్డి మందు తాగి 10 నుంచి 20 మరణిస్తున్నారని చెప్పారు. వరంగల్ ఎంజీఎంలో ఇదే పరిస్థితి ఉందని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. గడ్డి మందు త్రాగిన మనిషి బ్రతకడు అని డాక్టర్లు చెప్తున్నారు. గడ్డి మందు వాడకుండా నిషేధం విధించే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేయాలి. గడ్డి మందు వాడకాన్ని ఒడిశా ప్రభుత్వం ప్రతి ఆరు నెలల పాటు నిషేధిస్తూ వస్తోంది. ప్రపంచంలో 70 దేశాలు గడ్డి మందును నిషేధించాయి. గడ్డి మందు నిషేధంపై సీఎం రేవంత్ రెడ్డి,వ్యవసాయ శాఖా మంత్రికి లేఖ రాశాను. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కిషన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాల్లో గడ్డి మందు తాగి ఎక్కువ మంది చనిపోతున్నారని అన్నారు.

## చెత్త రహిత తిరుపతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

కమిషనర్ ఎన్.మౌర్య. చెత్త రహిత, సుందర తిరుపతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లో భాగంగా శనివారం నగరంలోని దండి మార్చ్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీటిడి బోర్డు మెంబెర్ పనబాక లక్ష్మి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్త కళల కార్పొరేషన్ చెర్మన్ హరి ప్రసాద్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ దూది కుమారి, అర్బన్ డెవలప్మెంట్ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ వూకా విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, నాయీ బ్రాహ్మణ సంఘం చైర్మన్ రుద్రకోటి సదాశివం లు పాల్గొని వ్యర్తాల వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, దుకాణ దారులకు తడి,పొడి చెత్త వేరు చేసేందుకు బుట్టలను అందజేశారు. అందరిచే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతినెల మూడవ శనివారం నిర్వహిస్తోందని తెలిపారు. అందులో భాగంగా ప్రతినెల ఒక అంశంపై ప్రజలకు, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగహన కల్పిస్తున్నామని తెలిపారు. తమ ఇంటితో పాటు, పరిసరాలు, కార్యాలయాల్లో వ్యర్థాలు లేకుండా శుభ్రం చేసి, వ్యర్థ రహిత, సుందర తిరుపతి సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఫోర్ బిన్ సిస్టం ద్వారా తడి, పొడి, ప్రమాదకర వ్యర్తాలు, ఈ వేస్ట్ అనే నాలుగు రకాలుగా చెత్త ను వేరు చేసి ఇవ్వాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల నుండి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను హోమ్ కంపోస్ట్ చేసి మొక్కలకు ఎరువుగా వినియోగించుకోవాలని తెలిపారు. హోమ్ కంపోస్ట్ తయారీ విధానం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డి. ఈ. లు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 23 నుండి 26వ తేదీ వరకు బూరగమంద శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో బాలాలయం

తిరుపతి, 2026 ఫిబ్రవరి 21 చిత్తూరు జిల్లా సదుం మండలం బూరగమంద గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 23 నుండి 26వ తేదీ వరకు "బాలాలయం" కార్యక్రమం శాస్త్రోక్తంగా జరుగనుంది. ఇందుకోసం ఫిబ్రవరి 23న ఉదయం 9 గంటలకు ఆచార్య రుత్విక్ వరణం, సాయంత్రం అంకురార్పణ, శాంతి హోమం, కళాకర్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.సాధారణంగా గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం "బాలాలయం" చేపడతారు. ఇందుకోసం ఆలయంలో నమూనా ఆలయం ఏర్పాటుచేసి గర్భాలయంలోని మూలవర్ల చిత్రపటాలను ఏర్పాటు చేస్తారు.ఇందులో భాగంగా ఫిబ్రవరి 24న ఉదయం అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, సాయంత్రం మహా శాంతి హోమాలు, వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఫిబ్రవరి 25న ఉదయం బాలాలయ స్థాపనారాధన, చతుర్ధశ కళశారాధన, పంచగవ్యాధివాసం, సాయంత్రం మహాశాంతి అభిషేకం, వైదిక కార్యక్రమాలు చేపడతారు.ఫిబ్రవరి 26న ఉదయం 7.30 గంటలకు యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షణ, బాలాలయ సంప్రోక్షణం, ధ్రువ కల్యాణం చేపడతారు.

## హాలహర్వి లో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం

నందవరం మండల పరిధిలో గ్రామాలను అత్యంత పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేద్దామని ఎంపీడీవో పుల్లయ్య పేర్కొన్నారు.మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ముందుగా గ్రామంలో ఈ కార్యక్రమం పై అధికారులు,ప్రజలు ప్రతిజ్ఞ చేశారు.పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ నిర్వహించి,విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే అత్యంత పరిశుభ్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారని ఇకపై ప్రతి నెలా మూడవ శనివారాన్ని స్వచ్ఛ దివస్ గా జరుపుకోవాలన్నారు.ప్రతి ఇంటి నుండి వంద శాతం చెత్త సేకరణ చేయాలన్నారు.దానిలో తడి చెత్త,పొడి చెత్త వేరే చేయాలని చెత్త కుప్పలు లేని సమాజం తయారు చేయడమే మన లక్ష్యంగా ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం మన బాధ్యత కావాలన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో సందీప్,పంచాయతీ కార్యదర్శి సుజాత,ప్రధానోపాధ్యాయులు బందే నవాజ్,టిడిపి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, టీడీపి నాయకులు ప్రభుదాసు,నాగరాజు,జగన్నాథ్ రెడ్డి,మణి కుమార్,ఎర్రం నాయుడు,ఆనందు,ఏసేపు,హారి,బుడ్డ రంగన్న,ప్రభాకర్,కాజా,ఉపాధ్యాయులు,తి మ్మప్ప,సచివాలయ సిబ్బంది,అంగన్వాడి కార్యకర్తలు,ఆశ వర్కర్లు,పారిశుధ్య కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాళ్ల పల్లిలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమం పాల్గొన్న కలెక్టర్ డా. వెంకటేశ్వర్

తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లిలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్వర్ణాంధ్ర?స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బాగంగా జీరో లిటర్ గవర్నెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పాల్గొని గ్రామస్తులకు తడి?పొడి చెత్త వేర్వేరు సేకరణ, రీసైక్లింగ్ సర్క్యులర్ ఎకానమీ ప్రాముఖ్యతపై వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర?స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రత్యేక థీమ్తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జనవరి నుంచి నిరంతరంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఈ నెల కార్యక్రమంలో ఈ నెల థీమ్గా జీరో లిటర్ గవర్నెన్స్ అమలవుతోందన్నారు.జీరో లిటర్ గవర్నెన్స్ అంటే ఎటువంటి చెత్త బయట పడవేయకుండా, ఇంటి వద్దే తడి చెత్త?పొడి చెత్త వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించడం అని తెలిపారు. తడి చెత్తను ఎరువుగా మార్చి కూరగాయల సాగుకు వినియోగించుకోవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా మళ్లీ వినియోగ వస్తువులుగా తయారు చేయవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా స్వచ్ఛ రథం ద్వారా చెత్త సేకరణ విధానాన్ని ప్రదర్శించారు. ఇద్దరు విద్యార్థులు సుమారు 11 కిలోల పాత నోటుబుక్స్, పేపర్లు అందజేసి, వాటి విలువగా వచ్చిన డబ్బుతో కొత్త నోటుబుక్స్ మరియు స్టేషనరీ కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ విధానం ద్వారా చెత్త తగ్గడమే కాకుండా విద్యార్థులకు, సేకరణదారులకు ఆదాయం కలుగుతుందని తెలిపారు.

## అహోబిలంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

### 284 మద్యం సీసాలు స్వాధీనం, 8 మందిపై చర్యలు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.ఆళ్లగడ్డ డీఎస్పీ కే .ప్రమోద్

,శనివారం తెల్లవారుజామున అహోబిలంలో ఆళ్లగడ్డ డిఎస్పి కే .ప్రమోద్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ సబ్ డివిజన్ లోని సుమారు 50 మంది సబ్ డివిజన్ అధికారులు మరియు సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (అయాా) నిర్వహించబడింది.ఈ ఆపరేషన్లో మొత్తం 8 మంది వ్యక్తుల వద్ద నుండి 284 మద్యం బాటిల్ లను స్వాధీనం చేసుకున్నారు.

అదనంగా ముఖ్య ప్రదేశాలలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. రౌడీ షీటర్లు, నేర చరిత్ర గలవారు మరియు అనుమానితుల ఇళ్లలో కూడా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ అహోబిలం ఒక ప్రతిష్ఠాత్మక పుణ్యక్షేత్రం అని, ఇక్కడ అక్రమ మద్యం విక్రయాలు, నాటు సారా, రౌడీయిజం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు సహించబోమని తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లో ఆళ్లగడ్డ రూరల్ సి ఐ బి.వి. రమణ, ఆళ్లగడ్డ రూరల్ ఎస్ ఐ వరప్రసాద్, ఉయ్యాలవాడ ఎస్ ఐ రామిరెడ్డి, చాగలమరి ఎస్ ఐ రాజారెడ్డి,ఆళ్లగడ్డ టౌన్ ఎస్ ఐ పీరయ్య, రుద్రవరం ఎస్ ఐ జయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడమే శాప్ లక్ష్యం

### తిరుపతిలో అట్టహాసంగా శాప్ రాష్ట్రస్థాయి చెస్ లీగ్. ఈ ఏడాదిలో 31 క్రీడాంశాలు నిర్వహిస్తాం. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

.తిరుపతి :రాష్ట్రంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ కృతనిశ్చయంతో పనిచేస్తుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్లో అట్టహాసంగా ప్రారంభమైన శాప్ లీగ్ను టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి, ఏపీ హ్యాండ్ లూమ్ (క్రాఫ్ట్) కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి నగర కమిషనర్ మౌర్యారెడ్డి, శాప్ ఎండీ భరణి, శాప్ డైరెక్టర్ రజినీలతో కలిసి శాప్ ఛైర్మన్ రవినాయుడు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ సభలో శాప్ ఛైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ అట్టడుగుస్థాయిలో సైతం క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసుకేందుకు స్పోర్ట్స్ అథారిటీ శాప్ లీగ్–2026ను ప్రారంభించి 31 క్రీడా అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. స్కూల్ స్థాయి నుంచే క్రీడాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో జీఓ నెం–4ను సైతం మార్పులు చేసేందుకు రాష్ట్రప్రభుత్వంతోపాటు స్పోర్ట్స్ అథారిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించేందుకు ప్రత్యేక పరీక్ష శిబిరంగా శాప్ లీగ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. దానిలో భాగంగానే కబడ్డీ, ఖోఖో, చెస్, వాలీబాల్, సైక్లింగ్, బాస్కెట్బాల్, ఫుట్బాల్, ఆర్చరీతోపాటు అథ్లెటిక్స్, పారా అథ్లెటిక్స్, వాటర్ గేమ్స్ తదితర 31 క్రీడలను శాప్ లీగ్లో మిళితం చేస్తూ స్పోర్ట్స్ అథారిటీ నిర్ణయించిందన్నారు. ఇదంతా కూడా రాష్ట్రంలోని క్రీడాకారులందరినీ ప్రోత్సహించేందుకు మాత్రమే చేపడుతున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చూసుకుంటే క్రీడలు ఆడేవారే లేరని, ఆడించడానికి కూడా ఎవరూ లేరని విమర్శించారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారిని అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చేదిద్దేందుకు స్పోర్ట్స్ అథారిటీ సిద్ధంగా ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడాకారులుగా తయారుచేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 2021 నుంచి 2024 గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ.16.30కోట్ల క్రీడాప్రోత్సాహకాలను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అలాగే మరో 8కోట్ల రూపాయలను విడుదల చేసేందుకు ప్రతిపాదనలు కూడా పెట్టామని వివరించారు. వచ్చే కామన్వెల్త్ అండ్ ఏషియన్ పోటీలకు అర్హత కలిగిన క్రీడాకారులను గుర్తించేందుకు స్పోర్ట్స్ అథారిటీ చర్యలు చేపడుతుందన్నారు. త్వరలోనే రూ.4కోట్లతో తిరుపతిలో 200మంది సామర్థ్యం కలిగిన క్రీడావసతి గృహాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీటీడీ బోర్డు మెంబర్ పనబాల లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదైతే ఆ ఘనత అంతర్జాతీయస్థాయిలో నిలబెట్టాల్సిన బాధ్యత క్రీడాకారులపై కూడా ఉందని సూచించారు. ఆంధ్రా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని, దానికి ఏపీ స్పోర్ట్స్ అథారిటీ సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ఈనాడు రాష్ట్రంలో క్రీడలు ఇంతగా అభివృద్ధి చెందుతున్నాయంటే విద్యార్థి నాయకుడిగా ఎదిగిన సమర్థుడైన రవినాయుడుకి శాప్ ఛైర్మన్గా బాధ్యతలు అప్పగించడమే కారణమంటూ క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఏపీ హ్యాండ్ లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్ హరిప్రసాద్ మాట్లాడుతూ శాప్ ఛైర్మన్గా రవినాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో క్రీడలు అనేవి పరుగులు పెడుతున్నాయన్నారు. యువత ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలంటే క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో మానసికస్థైర్యాన్ని పెంచుకోవచ్చన్నారు. తదుపరి నగర కమిషనర్ మౌర్యారెడ్డి మాట్లాడుతూ శాప్ ఛైర్మన్ రవినాయుడు కారణంగా తిరుపతిలో క్రీడా కార్యకలాపాలు ఊపందుకున్నాయన్నారు. గడిచిన ఏడాదిన్నరలో క్రీడాకారులకు వసతి సదుపాయాలను కల్పించి రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. శాప్ లీగ్కు హాజరైన క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని వివరించారు. అనంతరం శాప్ ఎండీ భరణి మాట్లాడుతూ శాప్ లీగ్లో ప్రతీ క్రీడకు సంబంధించి జిల్లాస్థాయిలో ఎంపికలు జరుగుతున్నాయన్నారు. క్రీడల్లో గెలుపోటములను సహజమని, ఓటమి పాలయ్యామని బాధపడకుండా మరింత ఉత్సాహంతో ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మదేవస్థానం ఛైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోటా వాసు పాల్గొన్నారు.

## ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే ఉద్దేశం

## వారానికి ఒకసారి మండలానికి, గ్రామానికి స్వచ్ఛ రథం: సిఎం చంద్రబాబు



అమరావతి ఫిబ్రవరి 21 వారానికి ఒకసారి మండలానికి, గ్రామానికి స్వచ్ఛ రథం వస్తుందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారని అన్నారు. పల్నాడు జిల్లా- వినుకొండలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మీకు ఆదాయం వస్తుందని, 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే తమ ఉద్దేశం అని.. అందుకే ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో పాల్గొంటానని అన్నారు. విశాఖలో చెత్త నుంచి కరెంటు తయారు చేస్తున్నారని, మరో ఐదు ప్లాంట్ల ద్వారా కరెంటు తయారు చేస్తామని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రాష్ట్రంలో బ్యాన్ చేశామని చెప్పారు. మార్చి 31 కల్లా వందశాతం ఇంటినుంచి చెత్త సేకరించేలా చేస్తామని, చెత్త ద్వారా మళ్లీ వస్తువుల ఉత్పత్తులు చేస్తామని సిఎం పేర్కొన్నారు. టెక్నాలజీ వినియోగంలో మనమే నెంబర్ వన్ అని..వ్యవసాయంలోనూ ఎఐ సేవలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. ఎన్ డిఎ కూటమి రాష్ట్రంలో పెను మార్పులు తీసుకురాబోతుందని, సూపర్ సిక్స్..సూపర్ హిట్ చేశామని తెలియజేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా చేస్తామని, స్త్రీశక్తి, దీపం పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల ఆదాయం పెంచేందుకు పి4 పథకం ఉందని, టెక్నాలజీ వినియోగాన్ని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ మెచ్చుకున్నారని అన్నారు. పల్నాడు అంటే పౌరుషాల గడ్డ అని.. పల్నాడు వస్తే వైబ్రేషన్స్ వస్తాయని, శివరాత్రి అంటే కోటప్పకొండ ప్రభలు ప్రత్యేకం అని కొనియాడారు. ఎఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవవేదన కలిగించిందని, కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదని సూచించారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని, దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని కోరారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు.

అసెంబ్లీలో తన సతీమణిని కూడా అవమానించారని, 23 క్లేమోర్ మైన్స్ ప్రయోగించినా తాను భయపడనని అన్నారు. వెంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని, వెంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. మాజీ మంత్రి, దివంగత నేత వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని, నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారని, ఇప్పుడు కూడా లడ్డూ కల్తీ చేసి హెరిటేజ్ పేరు తీసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. తాను ప్రాణం పోయినా తప్పు చేయనని, లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందని తెలిపారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, తప్పును పక్కన వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారని, నేరగాళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు నాయుడు హితవు పలికారు.

# వికలాంగులకు మూడు చక్రాల స్కూటర్లు అందజేత

రాయచోటి, అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోని పలువురు వికలాంగులకు మూడు చక్రాల స్కూటర్లను ఎంపీ మిధున్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిల ఆధ్వర్యంలో వైకాపా నాయకులు అందజేశారు. శనివారంనియోజకవర్గంలోని రామాపురం మండలంలో పలువురు వికలాంగులకు మూడు చక్రాలు స్కూటర్లను అందించి ఆదుకొన్నారు .ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి ల సహకారంతో వికలాంగ కార్యకర్తకు ఎలక్ట్రిక్ మూడు చక్రాల స్కూటర్ నుఅందించారు.రామాపురం మండలం కల్పనాయుని చెరువు గ్రామం గాలంగుండ్ల పల్లెకు చెందిన ఎస్సీ కులానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ కార్యకర్త జనార్దన్ పార్టీని ప్రాణంగా చూసుకునే వీరవిధేయుడు. గతంలో జరిగిన ప్రమాదంలో ఆయన ఒక కాలును కోల్పోయారు. ఆ క్లిష్ట సమయంలో అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆయన కుటుంబానికి అండగా నిలవడంతో పాటు బ్యాటరీ ట్రైసైకిల్ను అందజేశారు. ఆ ట్రైసైకిల్ ద్వారా జనార్దన్ సమీప ప్రాంతాలకు వెళ్లి తన పనులను నిర్వహించు కునేవారు.ఇప్పుడు ఆయనకు మరింత సౌకర్యం కల్పించేందుకు రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి సహకారంతో రూ. లక్షకు పైగా విలువ చేసే ఎలక్ట్రిక్ మూడు చక్రాల స్కూటర్ను శనివారం వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన జనార్దన్కు తోడుగా నిలిచి ధైర్యం ఇచ్చారు.ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రె?డ్డిలకు కృతజ్ఞతలు తెలిపిన జనార్దన్ ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు అన్ని విధాలుగా మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అండగా నిలిచారని జనార్దన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ మూడు చక్రాల స్కూటర్ను అందించిన ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జనార్దన్ ఫోన్ ద్వారా ఎంపీ మిథున్ రెడ్డితో మాట్లాడి హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.గత జగన్ ప్రభుత్వంలో రాయచోటి నియోజకవర్గంలో వికలాంగులకు ఎంపీ మిథున్ రెడ్డి సహకారంతో వేలాది మందికి ట్రైసైకిళ్లు, బ్యాటరీ త్రీ వీలర్లు, వీల్చైర్లు, వినికిడి యంత్రాలు అందజేసి అండగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నాగరాణి బాబు, సర్పంచ్ వెంకట్రామి రెడ్డి,నాయకులు చలపతి,శంకర్,శివ,గురుబాబు,నాగరాజు, ఆదిరెడ్డి,బాబిరెడ్డి,చక్రపాణి,కాశీనాయన తదితరులు పాల్గొన్నారు

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలి

## ఏపీడబ్ల్యూజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లగుండ్ల రామకృష్ణ

పిడుగురాళ్ల, పల్నాడుజిల్లా పిడుగురాళ్ల లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. చల్లగుండ్ల. రామకృష్ణ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టులకు అక్రిడీటేషన్ విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడీటేషన్ కమిటీ సమావేశాలు జరిగినప్పటికి ఇప్పటి వరకు అక్రిడీటేషన్ ఇవ్వలేదు అన్నారు. చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది, చాలా జిల్లాలలో అన్నీ అర్హతలు కలిగి ఉన్నప్పటికి అక్రిడీటేషన్లు మంజూరు చేయలేదు. బస్సు పాస్ లు రాష్ట్ర వ్యాప్తంగా ఇవ్వక పోవడంతో జర్నలిస్ట్ లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు అన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇవ్వని పక్షములో త్వరలో అన్నీ జర్నలిస్ట్ సంఘాలను కలుపుకొని తీవ్ర ఆందోళనలు, చేస్తాము అన్నారు. త్వరలో దీనిపై ప్రభుత్వం స్పందించని పక్షంలో పూర్తి స్థాయిలో ఉద్యమానికి సిద్ధమావుతాము అనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మహమ్మద్. రజాక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేతావత్. శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్డవల్లి. సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి షేక్. ఖాసీం, రాష్ట్ర ఉపాధ్యక్షులు. షేక్. జానీ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులను ప్రేమించలేని వ్యక్తులు అసలైన వికలాంగులు

## వైకల్యం విజయానికి అడ్డంకి కాకూడదు.ఓం మేఘారెడ్డి.

వనపర్తి. వికలాంగులుగా జన్మించడం తప్పు కాదని అలాంటి వారిని ప్రేమించలేని వ్యక్తులే అసలైన వికలాంగులని, ప్రతి ఒక్కరు వికలాంగుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.శనివారం వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మంది దివ్యాంగులకు స్కూటీల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.పాత మార్కెట్ యార్డ్ లో చేపట్టిన ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ హాజరై వారికి స్కూటీలను అందజేశారు.వైకల్యంతో ఎన్నో అవరోధాలను, కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని జయిస్తూ మనందరికీ స్ఫూర్తిని ఇస్తున్న దివ్యాంగులకు మనం కూడా చేయూతనిద్దాం.. వారిని గౌరవిద్దాం. అభిమానిద్దామని వారు సూచించారు.దివ్యాంగులు వికలత్వ భావనతో ఉండరాదని ఆత్మస్థైర్యంతో, పట్టుదల, ప్రతిభతో రాణించాలని. దివ్యాంగులు తమ ప్రతిభతో వివిధ రంగాల్లో రాణించి ఎందరికో స్ఫూర్తిగా నిలవాలన్నారు.దివ్యాంగుల్లో అమోఘ శక్తి దాగి ఉంటుందని, ఆ శక్తిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారనీ చెప్పారు.వైకల్యం విజయానికి అడ్డంకి కాదు.ప్రతిభ, ఆత్మవిశ్వాసం ముందుకు నడిపిస్తాయి.అందరం కలుద్దాం అంగవైకల్యం ఉన్నవారికి అండగా నిలబడదామని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు దివ్యాంగుల శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ఇంటిపై దాడి

# ఖండించిన ఎంపి డికే ఆరుణ

హైదరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఎంపి డికే అరుణ అన్నారు. ఒక ప్రజాప్రతినిధి ఇంటిపై దాడికి యత్నించడం అధికార కాంగ్రెస్ అహంకారం, దుర్మార్గపు చర్యకు నిదర్శనం. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆమె ఆరోపించారు.వెంకటరమణారెడ్డి విసిరిన సవాల్ ను స్వీకరించలేక, ఆయన ఇంటి పైకి రౌడీలను పురమాయించడం కాంగ్రెస్ ప్రతీకార రాజకీయానికి అద్దంపడుతుంది. కామారెడ్డిలో కేసీఆర్,రేవంత్ రెడ్డిలను ఓడించడాన్ని జీర్ణించుకోలేక.. మొన్నటి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీని ఒంటరిగా ఎదుర్కోలేక.. కాంగ్రెస్, బీఆర్ఎస్ లు ఏకమై కక్షా రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు.

## రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

## పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



హైదరాబాద్ ఫిబ్రవరి 21 పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఎక్స్-ఆఫిషియో కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, తెలిపారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన అధికారులను కఠినంగా ఆదేశించారు. హైదరాబాద్లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను యాదృచ్ఛికంగా తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యం లో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్చార్జీలకు సూచించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాచి పడిన కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు.సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్వర్డ్?అవుట్వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ గారు వారి పనివాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు."ప్రజల విశ్వాసమే మా బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యతే ప్రమాణం కావాలి. రేషన్ బియ్యం విషయంలో చిన్న తప్పిదం కూడా సహించము," అని కమిషనర్ గారు స్పష్టం చేశారు. ఈ తనిఖీ లో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్చార్జీలు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట దుబ్బాక మండలం రామక్కాపేట గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అన్నం,గుడ్డు, బెండకాయ కూర,టమాటా పప్పు, రసం, పెరుగు లను పరిశీలించారు. బెండకాయ కూర, టమాటా పప్పు సాంబారు మాదిరి నీళ్ళలా ఉందని, రసం మాత్రం పచ్చి పులుసు మాదిరి ఉండడం చూస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి అన్ని సరుకులు, కూరగాయలు, అన్ని అందిస్తుంటే పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన కూరలతో కాకుండా భోజనం ఇలా పెడతారా అని కేర్-టేకర్ మరియు ఉపాధ్యాయులపైన మండిపడ్డారు. 500 కి పైగా విద్యార్థులకు సరిపడా వండకుండా చేసిన కూరలు సైతం 237 మంది విద్యార్థులకు సరిపోకపోగా 132 మంది విద్యార్థులకు గుడ్లు ఎందుకు తక్కువ వండారని వంట సిబ్బందిని ఆరా తీశారు. సగం మంది విద్యార్థులకు కూరలు సరిపోలేదని దగ్గరుండి టమాటా కూర వండించారు. కూరను రుచిగా చేయడానికి పలు సూచనలు చేశారు. కూర వండించి మిగిలిన విద్యార్థులకు పెట్టించారు. స్టాక్ రిజిస్టర్ వెరిఫై చేస్తూ రాసిన సరుకులకు చేసిన వంటకంకి అస్సలు పొంతనే లేదని అసహనం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూ పాటిస్తూ రోజు విద్యార్థుల హాజరు ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని లైబ్రేరియన్, ప్రతి వంటకం విద్యార్థులకు అందరికీ సరిపోయాలని కడుపు నిండా తినేవిధంగా రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. ఇంత అధ్వానంగా భోజనం పెడుతున్నందుకు గాను కేర్-టేకర్ మరియు ఇతర అధికారులైన కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్ అధికారికి ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, వసతి, చదువు విషయంలో రాజీ పడవద్దని ప్రభుత్వం అందజేస్తున్న ఫలాలను విద్యార్థులకు చేరవేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

# చంచల్ గూడ జైలు లో ఉగ్ర కుట్రలు

# ఖండించిన జైలు అధికారులు

హైదరాబాద్ చంచల్గూడ జైలులో ఉగ్ర కుట్ర జరుగుతోందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై జైలు శాఖ స్పందించింది. అవన్నీ పూర్తిగా వదంతులేనని జైలు శాఖ డీఐజీ శ్రీనివాస్ స్పష్టం చేశారు.చంచల్గూడ జైలులో ఉగ్ర కుట్ర జరుగుతోందని సోషల్ మీడియా, కొన్ని ఛానెల్స్ ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలపై జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు.

జైలులో ఎలాంటి ఉగ్ర కుట్రలు జరగలేదని, ప్రచారంలో ఉన్న వార్తలు పూర్తిగా నిరాధారమని తెలిపారు. నేషనల్ సెక్యూరిటీకి సంబంధించిన అంశం కావడంతో వార్తలు ప్రసారం చేసే ముందు తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని మీడియాకు సూచించారు. పుకార్లు వ్యాప్తి చేయడం వల్ల ప్రజల్లో భయాందోళనలు పెరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. చంచల్గూడ జైలులో లష్కర్-ఏ-తొయిబాకు చెందిన జాయిద్ అనే ఒక ఉగ్రవాది మాత్రమే ఉన్నాడని తెలిపారు. అతన్ని కలవడానికి అతని భార్య తప్ప మరెవరూ రారని వెల్లడించారు. అతనికి వారానికి రెండు ములాఖాత్లు ప్రత్యేక సమయాల్లో, సాధారణ ఖైదీలతో కలపకుండా నిర్వహిస్తామని చెప్పారు.

"చంచల్గూడ జైలులో ఎలాంటి ఉగ్ర కుట్రలు జరగలేదు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారాలు. నేషనల్ సెక్యూరిటీ అంశం కాబట్టి వార్తలు ప్రసారం ముందు వెరిఫై చేసుకోవాలి. పుకార్లు వ్యాప్తి చేయవద్దు." కాబట్టి చంచల్గూడ జైలులో ఉగ్ర కుట్రలంటూ వస్తున్న వార్తలు వదంతులేనని జైలు శాఖ స్పష్టం చేసింది.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

## ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు

అరకులోయ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి.చలపతిరావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో లో భాగంగా ఫిబ్రవరి థీమ్ "జీరో లిట్టర్ గవర్నెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి.చలపతిరావు మాట్లాడుతూ జీరో లిట్టర్ గవర్నమెంట్ అంటే ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా శుభ్రమైన వాతావరణాన్ని కాపాడుతూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించడం ప్రభుత్వం మాత్రమే కాదు ప్రతి విద్యార్థి, ప్రతి అధ్యాపకులు, ప్రతి పౌరుడు, ఇందులో భాగస్వామి కావాలి అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కోఆర్డినేటర్ కే.బాలరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి, చెత్తను వేరువేరు డస్ట్ బిన్లలో వేయాలి(తడి పొడి హానికర వ్యర్థాలు వేరుచేసి వేయాలని), క్యాంపస్ ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి, పరిశుభ్రమైన క్యాంపస్ మన గౌరవాన్ని పెంచుతుందని విద్యార్థులకు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛఆంధ్ర సభ్యులు జి.సంధ్య మాట్లాడుతూ మన కాలేజీని మన పరిసరాలను చెత్త రహితంగా ఉంచాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణాన్ని కాపాడాలని, కాలేజీని జీరో లిట్టర్ క్యాంపస్ గా మార్చేందుకు అందరి సహకారం అవసరమని విద్యార్థులకు తెలిపారు ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర సభ్యులు ఓ.చంటి , అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు

# పెళ్ళింట విషాదం..!

# నవ వధువరులకు తీవ్ర గాయాలు ,బంధువు మృతి

అనకాపల్లి కె కోటపాడు (మ) బత్తివానిపాలెం గ్రామ సమీపాన వెర్టిగో కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఘటనలో శుక్రవారం రాత్రి వివాహం చేసుకున్న నవ వధువరులకు తీవ్రగాయాలు అయ్యాయి. దుర్ఘటనలో పెళ్ళి కొడుకు చెల్లి లావణ్య మృతి చెందింది. గాయాపడిన నవ వధువరులను ఆసుపత్రికి తరలించారు. వారంతా బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట కు చెందిన వారిగా గుర్తించారు.

# బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అరెస్టు

మేడ్చల్ కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి పై కాంగ్రెస్ నేతల దాడి విషయం తెలుసుకొని, ఆయనను పరామర్శించడానికి కామారెడ్డికి పయనమైన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి ని మేడ్చల్ చౌరస్తాలో పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసారు.

# ఆర్ ఆర్ డి డిస్టలరీ ని ప్రారంభించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 21 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** ఆందోల్ మండలం లోని పోసానిపేట్, గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన (ఆర్ఆర్ డి) డిస్టలరీ, ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు,ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ, మాట్లాడుతూ, ఆందోల్ నియోజక వర్గాన్ని ఎడ్యుకేషనల్, హెల్త్ హబ్ గా తీర్చిదిద్దామన్నారు. సింగూర్ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో 40, వేల ఎకరాల ఆయకట్టకు సాగునీరు అందిస్తున్నామన్నారు, నియోజకవర్గంలో మరో లక్ష ఎకరాల ఆయకట్టకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.



అలాగే, నిరుద్యోగులకు, మహిళలకు, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు, (ఆర్ ఆర్ డి )డిస్టలరీ ని ఏర్పాటుచేసిన యాజమాన్యాన్ని అభినందించారు, పరిశ్రమలోని అన్ని విభాగాలను,పరిశీలించారు . పరిసర ప్రాంతాలలో ఉన్న వారికి ఈ పరిశ్రమలో ఉపాధి కల్పించడాన్ని మంత్రి స్వాగతించారు, ఈ పరిశ్రమ మరింత విస్తరించి రానున్న రోజుల్లో మరో 500 మందికి ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు కల్పించేందుకు దోహద పడాలని,మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆకాంక్షించారు, నియోజకవర్గంలో పరిశ్రమల



ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామన్నారు,ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, (ఆర్ఆర్ డి) డిస్టలరీ( ఎండీ) కొండల నిపుణ్ రెడ్డి, కంపెనీ డైరెక్టర్ త్రిష, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, బండ అభిలాష్ రెడ్డి, తీగల నర్సిరెడ్డి,సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ కి చెందిన పలువురుల కార్పొరేటర్లులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.....

# అల్లాదుర్గం లో భారీగా అక్రమ బియ్యం పట్టివేత



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 21 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :బీహార్,నుండి అల్లాదుర్గం, మండలానికి తరలిస్తున్న అక్రమ బియ్యం లారీని, అల్లాదుర్గం పోలీసులు,పట్టుకున్నారు, బీహార్ రాష్ట్రంలోని ప్రైవేటు వ్యక్తుల నుండి దొడ్డు రకం బియ్యం లారీల్లో రవాణా చేస్తూ, అల్లాదుర్గం మండలంలోని,శ్రీ సాయి బిన్నీ రైస్ మిల్, కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని, స్థానిక స్టేషన్ కు తరలించారు,పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం సుమారు 42 టన్నులు,దీని విలువ 11, లక్షల 13, వేల 77, రూపాయల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు,బియ్యం తరలింపుకు సంబంధించిన ధ్రువపత్రాలు ,సరిగ్గా లేనందున అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు, సివిల్ సప్లాయి అధికారులకు సమాచారం అందించి,పూర్తి స్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని, ఎస్సై శంకర్ తెలిపారు.....

# జమ్మికుంట పట్టణంలో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తాను జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 21**జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మోత్కులగూడెం లో ఉన్న గ్రామ దేవతలను శుక్రవారం రోజున జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) స్థానిక కౌన్సిలర్స్ పొనగంటి రాము, పొన్నగంటి విష్ణు, తిరుపతి లతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను స్థానిక కౌన్సిలర్లు నా దృష్టికి తీసుకొచ్చారని వాటిని తొందర్లోనే పరిష్కరిస్తామని జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అన్నారు. మోత్కులగూడెం పరిధిలో గల మూడు వార్డు పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలకు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉండి అన్నివేళలా అందుబాటులో ఉంటానని, అన్ని వార్డులలో స్థానిక కౌన్సిలర్స్ సహకారంతో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తానని చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనముగా ప్రారంభమైన కరుణగిరి పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవాలు

## ప్రారంభించిన బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్

## ప్రారంభ సూచకగా పతాక ఆవిష్కరణ

**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 21 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో గల కరుణగిరిలో కరుణగిరి యాత్ర 27 వ మహోత్సవాలు కరుణగిరిలో ప్రారంభమైనవి వీటిని బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్







పతాక ఆవిష్కరణ చేసి ప్రార్థనలతో ప్రారంభించినారుదీనిలో మత గురువులు సిస్టర్లు బ్రదర్ లు వేలాది భక్తులు సంఘ పెద్దలు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడిన బిషప్ ఈ యాత్ర మహోత్సవాల సందర్భంగా నవదిన ప్రార్థనలను ప్రతిరోజు జరుగుతున్నట్లు తెలియపరిచినారు ఈప్రార్థనలు ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమ వుతాయని తెలియ పరిచినారు 27వ తేదీ నుండి మార్చి ఒకటో తేదీ వరకు ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతాయని తెలియ పరిచినారు ఒకటవ తేదీ సాయంత్రము విశ్రాంత బిషప్ శ్రీశ్రీ మైన్ పాల్ చే పవిత్ర దివ్య బలి పూజ ఉంటుందని మహోత్సవ దివ్య బలి పూజ హైదరాబాద్ అగ్ర పీఠాధిపతులు మరియు సిబిసిఐ ప్రెసిడెంట్ కార్డినల్ పూల ఆంథోని గారిచే సమిష్టి పండగ పూజ నిర్వహించటం జరుగుతుందని తెలియపరిచినారు ప్రతిరోజు సాయంత్రం భక్తి రస సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ బడతాయని తెలియపరిచినారు భక్తులు ఈ యొక్క అవకాశాలను ఉపయోగించుకొని క్రమశిక్షణతో భక్తి తో కార్యక్రమాలకు అనుగుణంగా సహకరించాలని పాల్గొనాలని ఈ యొక్క యాత్ర మహోత్సవ ప్రతి అంశములోనూ భాగస్వామ్యులై ప్రార్థనా పూర్వకంగా వీటిని నడిపించాలని సంవత్సర మునకు ఒకసారి జరిగే రెండు జిల్లాల స్థాయిలో ఉన్న విస్తరించి ఉన్న కతోలిక సంఘము ఆ స్థాయిలో అందరూ సహకరించాలని కోరినారు తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వారికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలియపరిచినారు

# వేములవాడలో పదవీ బాధ్యతలు చేపట్టిన నూతన మున్సిపల్ పాలకవర్గం.

## బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శనివారం రోజున వేములవాడ మున్సిపల్ నూతన చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యాడు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, వైస్ చైర్మన్ లకు విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాలతో



ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది మాట్లాడుతూ వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉందని అన్నారు. ప్రజలు తమ ఆశలతో మనకు అధికారాన్ని కట్టబెట్టారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పారదర్శకమైన, అవినీతి రహిత పాలనను అందించాలని ఆయన సూచించారు. పట్టణ అభివృద్ధిలో ప్రతి వార్డును సమానంగా పరిగణలోకి తీసుకొని, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానానికి, తమను గెలిపించిన వేములవాడ పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మార్గ నిర్దేశనంలో, అందరి సమన్వయంతో వేములవాడను రాష్ట్రంలోనే అత్యుత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఊరట

భివాండీ ఫిబ్రవరి 21 పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కి ఊరట లభించింది. మహారాష్ట్ర లోని భివాండీ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. మహాత్మాగాంధీ హత్య వెనుక ఆరెస్సెస్ హస్తం ఉందని 2014లో రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఆరెస్సెస్ కేసు వేసింది.మహారాష్ట్రలోని భివాండీ కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. ఇవాళ జరిగిన విచారణకు రాహుల్‌గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ క్రమంలో న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అక్కడ ఆయన మాట్లాడుతూ.. ఆరెస్సెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు.మహాత్మాగాంధీ హత్య వెనుక సంఘ్ హస్తం ఉందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. దాంతో రాహుల్ వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంటూ.. అప్పట్లో సంఘ్ కార్యకర్త రాజేష్ కుంటే మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదుచేశారు. ఆ కేసు విచారణలో ఇప్పుడు రాహుల్‌గాంధీకి బెయిల్ మంజూరయ్యింది.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతల అబద్ధపు ప్రచారాలు.

**దళితుల కోసం పదేళ్లలో చేసింది ఏమిటి, రాజన్న సాక్షిగా బిఆర్ఎస్ ను నిలదీసిన కనికరపు రాకేష్.**

**ప్రాంతంతో సంబంధంలేని నేతలతో రాజకీయాలు, బిఆర్ఎస్ తీరుపై తీవ్ర ఆగ్రహం.**


**ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి, ఫోటోలకు ఫోజులిచ్చి మాయమయ్యే నాయకులను ఇప్పటికే తిరస్కరించారు.**

**ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నేతల అత్యున్నత భావం, వేములవాడ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రకటన.**



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి తట్టుకోలేక, ఉనికి కోసం పాకులాడుతున్న బిఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదమని వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తీవ్రంగా ఖండించారు. ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిన ఆ పార్టీ నాయకులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న రాజకీయం పట్ల ప్రజలు విసుగు చెందారని ఆయన ధ్వజమెత్తాడు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉన్న నాయకులు, ఏనాడో కాలం చెల్లిన పార్టీలో ఎలా ఉంటారని ప్రశ్నిస్తూ, ప్రజా క్షేత్రంలో ఉండి పనిచేయాలని ఉద్దేశంతోనే ఎందరో నాయకులు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారని, దీన్ని పార్టీ మార్పుగా కాకుండా ప్రజల వైపు వేసిన సామాజిక అడుగుగా చూడాలని రాకేష్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లు చేరికపై ఆ పార్టీ నేతలు చేస్తున్న రాద్ధాంతం వారిలోని అత్యున్నత భావానికి ఓటమి భయానికి నిదర్శనం అని ఎద్దేవా చేశారు. దళితుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కుబిఆర్ఎస్ పార్టీకి లేదని, పదేండ్ల కాలంలో దళితులకు మీరు చేసింది ఏమిటి, మీరు నిర్మించిన దళిత గడపల నాణ్యత ఎంత, దీనిపై రాజన్న గుడి ముందే బహిరంగ చర్చకు సిద్ధమా, అని ఆయన పత్రిక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి, ఫోటోలకు ఫోజులిచ్చి మాయమయ్యే నాయకులను వేములవాడ ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, అందుకే మొన్నటి ఎన్నికలలో మూడో స్థానానికి పరిమితం చేశారని గుర్తు చేశారు. వేములవాడ గల్లి గల్లి తెలిసిన నాయకుల మేము, ప్రజల కష్ట సుఖాల్లో భాగస్వాములు అవుతుంటే, కనీసం ఇక్కడి వార్డుల పేర్లు కూడా తెలియని వ్యక్తులను తెచ్చి ప్రెస్ మీట్ లు పెట్టించడం బిఆర్ఎస్ రాజకీయ ఖాళీతనానికి పరాకాష్టాన్ని విమర్శించారు. పదేళ్లు నిర్లక్ష్యానికి గురి అయిన రోడ్లు, బ్రిడ్జిలు, డ్రైనేజీ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తుందని, ప్రజల్లో వస్తున్న మార్పే అభివృద్ధికి నిదర్శనమని రాకేష్ పేర్కొన్నారు. ప్రజల కడుపు నిండితే బిఆర్ఎస్ నాయకులకు కడుపులో మంట ఎందుకని, అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే మీకు సరియైన బుద్ధి చెబుతారని, మాటలతో రాద్ధాంతాలు చేయడం కాదు, అభివృద్ధి చేసే దమ్ముంటే నిరూపించుకోవాలని ఆయన సవాలు విసిరారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత వేగంగా, వేములవాడను ఆదర్శవంతమైన పట్టణంగా మారుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎరువుల బుకింగ్ మొబైల్ యాప్‌లోనే'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్' ఇకపై రాష్ట్రమంతటా అమలు కానుంది




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 21 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**గత ఖరీఫ్ సీజన్‌లో ఐదు జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ మొబైల్ యాప్‌ను యాసంగి సీజన్‌లో, రాష్ట్రమంతటా అమలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ప్రకటించారని, సమాచారం గతంలో డీలర్ కేంద్రాల్లో ఆధార్ ధృవీకరణ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేది,దుకాణాల వద్ద భారీ క్యూ లైన్లు, బ్లాక్ మార్కెట్, అధిక ధరలతో రైతులు ఇబ్బంది పడేవారు, ఈ సమస్యలకు పరిష్కారంగానే, ప్రభుత్వం మొబైల్ యాప్‌ను తీసుకొచ్చిందని,ఈ మొబైల్ యాప్‌లో సమీపంలోని డీలర్ల వద్ద ఉన్న ఎరువుల నిల్వలు కనిపిస్తాయి, వాటి ఆధారంగా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చు బుకింగ్ నిర్ధారణ అయిన తర్వాత డీలర్ వద్దకు వెళ్లి, యూరియాను తెచ్చుకోవచ్చు,ఈ విధానం వల్ల ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు పడే సమస్య తప్పడంతో ఈ విధానంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు, బుధవారం(ఫిబ్రవరి 18) నాటికి 14.29 లక్షల మంది రైతులు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా 56.86 లక్షల బస్తాల యూరియా బుక్ చేసుకోగా 51.47 లక్షల బస్తాల పంపిణీ పూర్తయినట్లు సమాచారం....

# యుఎస్ఎ సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

న్యూయార్క్ ఫిబ్రవరి 21 యుఎస్ఎ సుప్రీంకోర్టు తీర్పును అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తప్పుబట్టాడు. సుప్రీం నిర్ణయం దేశానికే అవమానకరమని, సుప్రీంకోర్టు జడ్జిలని చూసి సిగ్గుపడుతున్నానని, జడ్జిల తీర్పు తీవ్రంగా నిరాశపర్చిందని దుయ్యబట్టారు. ట్రంప్ విధించిన సుంకాలు చెల్లబోవు అని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు జడ్జిలు విదేశీ ప్రభావానికి లోనయ్యారని, ఎట్టి పరిస్థితుల్లో టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ట్రంప్ సుంకాల వ్యతిరేకించిన వారిలో ఆరుగురు జడ్జిల్లో నలుగురు మహిళలు అమీకోనీ బారెట్, సోనియా సోటోమేయర్, ఎలెనా కగన్, కేతాంజీ బ్రౌన్ జాక్సన్, ఇద్దరు పురుషులు జాన్ రాబర్ట్స్, నీల్ గోర్సుచ్ ఉన్నారని తెలియజేశారు. ట్రంప్ సుంకాలను సమర్థించిన ముగ్గురు జడ్జిల్లో క్లారెన్స్ థామస్, బ్రెట్ కవనాఫ్, శామ్యూల్ అలిటో ఉన్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత 10 శాతం గ్లోబల్ టారిఫ్ ఆర్డర్స్ పై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఆయనకు అత్యంత ఇష్టమైన పదం టారిఫ్ అని ప్రకటించుకోవడమే కాకుండా... ఎడాపెడా సుంకాలు వేస్తూ ప్రపంచ దేశాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా తన దారి కి తెచ్చుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారీ షాక్ తగిలిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ట్రంప్ విధించిన సుంకాలు చెల్లబోవు అని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆయా దేశాల వద్ద నుంచి వసూలు చేసిన అదనపు సుంకాలను తిరిగి వారికి చెల్లించాలని స్పష్టం చేసింది. ట్రం ప్ తన అధికారాలను అతిక్రమించారని మొట్టికాయలు వేసింది. దేశ వాణిజ్య భాగస్వాముల పై సుంకాలు విధించడం చట్ట విరుద్ధమని, అధికార పరిధిని మించిపోవడమేనని ఘాటైన వ్యా ఖ్యలు చేసింది. ఏకపక్షంగా సుంకాలు విధించడాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది. జాతీయ అ త్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన అత్యవసర వినియోగాల చట్టాన్ని అతిక్రమించారని అభిప్రాయపడింది. శుక్రవారంనాడు అమెరికా సుప్రీంకోర్టు ధర్మాసనం 6-3 తేడాతో ఈ చరిత్రాత్మక తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే.

## అయిజలో అగ్నిప్రమాదం.. భారీగా ఆస్తి నష్టం

జోగులాంబ గద్వాల ఫిబ్రవరి 21 జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజలో అగ్నిప్రమాదం జరిగింది. అయిజలోని ఓ ప్రైవేటు కంపెనీలో భారీగా మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో స్థానికులు భయంతో వణికిపోయారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. ప్రాణ నష్టం గురించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## జోగిపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త యూసుఫ్ కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ,



**అందోల్ నియోజకవర్గం ప్రతినీది పీబ్రవరి 21 (ప్రజబలం )సంగారెడ్డి జిల్లా,:** ఆందోల్ నియోజకవర్గం లోని ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ లోని 15వ, వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త యూసుఫ్,ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ చనిపోయిన సమాచారం,అందుకున్న తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఈ రోజు శనివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు, వారి సోదరుడు జీషాన్,తో మాట్లాడారు,వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.....

# వంజరులకు జరిగిన చారిత్రక అన్యాయానికి నిరసనగా.. ఫిబ్రవరి 23న రాష్ట్రవ్యాప్త 'బ్లాక్ డే' - సామాజిక కార్యకర్త వెంకట్ రమణ వంజరి పిలుపు



**ఫిబ్రవరి 21 హైదరాబాద్ (ప్రజాబలం ప్రతినిధి)** వంజరి సమాజానికి జరిగిన సామాజిక అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 23వ తేదీని రాష్ట్రవ్యాప్తంగా ×'బ్లాక్ డే'×గా పాటించాలని సామాజిక కార్యకర్త వెంకట్ రమణ వంజరి పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, వంజరులు ఆది నుండి అడవుల్లో నివసించే సంచార గిరిజన తెగ అని, వీరి సామాజిక చరిత్ర మరియు వెనుకబాటుతనాన్ని గుర్తించిన అప్పటి ప్రభుత్వం 30 జూన్ 1977న జీఓ నం. 245 ద్వారా ఎస్టీ (గా) జాబితాలో చేర్చిందని గుర్తు చేశారు.అయితే, ఎటువంటి శాస్త్రీయ అధ్యయనాలు లేకుండానే 23 ఫిబ్రవరి 1979న జీఓ నం. 44 ద్వారా ఆ రిజర్వేషన్లను తొలగించి, వంజరులను బీసీ-డీ (ఃఅ-ఆ) జాబితాలోకి మార్చడం వల్ల వంజరి సమాజం మొత్తం విద్యా, ఉద్యోగ అవకాశాలను కోల్పోయిందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చారిత్రక తప్పిదం వల్ల ఒక తరానికి చెందిన వంజరి బిడ్డల భవిష్యత్తు అంధకారమైందని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో, అన్యాయంగా తొలగించబడిన ఎస్టీ రిజర్వేషన్లను తక్షణమే పునరుద్ధరించాలని, చట్టసభల్లో వంజరి సమాజానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని వెంకట్ రమణ డిమాండ్ చేశారు. అలాగే వంజరి బిడ్డల విద్యా, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని ఆయన కోరారు. రాబోయే ఫిబ్రవరి 23న తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి వంజరి కులస్తుడు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలపాలని, ప్రతి మండల మరియు జిల్లా కేంద్రాల్లో తహసీల్దార్లకు, కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మన హక్కుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వంజరి సంఘాలన్నీ ఏకం కావాలని ఈ సందర్భంగా వెంకట్ రమణ వంజరి పిలుపునిచ్చారు.

# షీ-షట్లర్ బస్సును ప్రారంభించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్.

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 21(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన "షీ-షట్లర్" బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ బస్సును ప్రారంభించారు,ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,సంగారెడ్డి జిల్లా పాశమైలారం పరిశ్రమలలో విధులు నిర్వహిస్తున్న మహిళల భద్రత,సురక్షిత ప్రయాణానికి సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ కట్టుబడి ఉందని తెలిపారు. ఎస్.ఎస్.ఎస్.సి ఆధ్వర్యంలో న్యూలాండ్ పరిశ్రమ సహకారంతో నూతన "షీ-షట్లర్" బస్సును ప్రారంభించడం జరిగిందన్నారు,జిల్లాలో ప్రజల,






పరిశ్రమల భద్రత, ట్రాఫిక్ సమస్యల నియంత్రణ మరియు మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలను అరికట్టాలనే ఉద్దేశంతో ఈ సొసైటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సంస్థ పోలీసు శాఖ మరియు కంపెనీల అనుసంధానంతో పనిచేస్తోందన్నారు. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రత్యేక బస్సు సౌకర్యం అవసరమని భావించి "షీ-షట్లర్" ప్రారంభించామని పేర్కొన్నారు,ఈ బస్సు ఇస్నాపూర్ నుండి ఇంద్రకరణ్ రూట్‌లో రోజుకు ఉదయం నుండి సాయంత్రం నడుస్తుందని తెలిపారు. ఆ మార్గంలో ప్రయాణించే మహిళలు మరియు పాఠశాల విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ బస్సు జీపీఎస్‌కు అనుసంధానమై ఉండటంతో బస్సు ప్రస్తుత స్థానం మరియు సమయ వివరాలను సులభంగా తెలుసుకోవడానికి సులువుగా ఉంటుంది అన్నారు,మహిళలు తప్పనిసరిగా "టి- సేఫ్" యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, మీ ప్రయాణ వివరాలను ఈ యప లో అప్లోడ్ చేయడం ద్వారా మీ ప్రయాణాన్ని పోలీసులు నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుంది అన్నారు. ఏదైనా ఆపద సమయంలో డైల్ 100 చేయాలని సూచించారు,ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.ఎస్.సి జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ట్రెజరర్ రమణారెడ్డి, ఇతర ఎస్.ఎస్.ఎస్.సి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మరియు ఐలా పాశమైలారం కమిటీ సభ్యులు, న్యూల్యాండ్ కంపెనీ సెక్రటరీ శారద, హెచ్.ఆర్ , ఐ ఆర్ డి.వి.రెడ్డి, హెచ్.ఆర్ డి.జి.యం. సూర్య భగవాన్, న్యూల్యాండ్ ఫౌండేషన్ సి.ఎస్.ఆర్ యాదగిరి, అడ్మిన్ నవీన్, రఘునాథ్, ప్లాంట్ హెడ్ మహేష్ జోషి తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు: ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి.ఎం వినోద్ కుమార్.



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు తిసుకుంటున్నట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి.ఎం వినోద్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ, గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పనకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రం నుంచి వివిధ గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికుల సంక్షేమం కొరకు ప్రభుత్వం సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీని రూపొందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే కమిటీ, నిర్మల్ జిల్లాలో పర్యటించిందని తెలిపారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులకు ఏ విధమైన పాలసీలు పాలసీలు రూపొందించాలన్న విషయంపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా తెలుసుకునేందుకు గల్ఫ్ వలస కార్మికులు, వారి కుటుంబాలతో వివరాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు అధికంగా ఉన్నాయని, గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులకు ఆయా దేశాల చట్టాలు, కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. లైసెన్సులు కలిగిన ఏజెన్సీల ద్వారానే కార్మికులు విదేశాలకు వెళ్లేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున 'టామ్ కామ్' ద్వారా కార్మికులకు విదేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని, దీనిపై గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన అవసరమని అభిప్రాయపడ్డారు. గల్ఫ్ దేశాలలో సమస్యల్లో చిక్కుకున్న కార్మికులకు సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. జిల్లాలో వినూత్నంగా గల్ఫ్ కార్మికుల కొరకు ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ సమావేశంలో భాగంగా, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో గల్ఫ్ కార్మికుల సహాయార్థం హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ గల్ఫ్ దేశాలలో చిక్కుకున్న పలువురు కార్మికులను కలెక్టర్ చొరవతో సురక్షితంగా స్వదేశానికి రప్పించగలిగినట్టు వివరించారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు, సంబంధించిన వివిధ శాఖలు సమన్వయంతో పని చేస్తూ కృషి చేస్తున్నాయని తెలిపారు. ఎన్ఆర్ఐ అడ్వైజరి కమిటీ బృందాన్ని, అధికారులని పలువురు శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించండి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 21(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/పల్లెల సర్వతో ముఖాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు,నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులను ఉద్దేశించి ప్రసంగించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.



ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శక పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలని సూచించారు,ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి స్పందించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు,గ్రామ పంచాయతీలను ఆదర్శవంతమైన స్థానిక సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, పారదర్శకత,బాధ్యతాయుత వైఖరి పాటించాలని సూచించారు,ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మరియు ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు మరియు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లా శనివారం పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

### చీఫ్ సూపరెండెంట్ల పాత్ర అత్యంత కీలకం.

### జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి ప్రజాబలం ప్రతినిధి** పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా క్రమబద్ధంగా నిర్వహించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరెండెంట్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పదవతరగతి పరీక్షల నిర్వహణ పై చీఫ్ సూపరెండెంట్లు, శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు ఒత్తిడిలేకుండ పరీక్షలు రాయడానికి అనుకూల వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు.చీఫ్ సూపరెండెంట్లు నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పాటించాలని సూచించారు. ప్రశ్నపత్రాల భద్రత, సమయపాలన, పర్యవేక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.అలాగే, తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు విద్యార్థులకు మానసికంగా ధైర్యం చెప్పి ప్రోత్సహించాలని జిల్లా పాలనాధికారి విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిపాలన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని , అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు వచ్చే నెల మార్చి 14 వ తేదీ నుండి ఎప్రిల్ 16 వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లాలో 65 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష ప్రారంభానికి ముందుగానే విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని హితవు పలికారు. ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రశ్నాపత్రాలను ఆయా రూట్ల వారీగా పోలీస్ ఎస్కార్ట్ మధ్య తరలించాలని, పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేయడంతో పాటు తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు.ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి, పరిశుభ్రమైన వాతావరణం తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను పరీక్షా కేంద్రాల్లో నియమించి, ప్రథమ చికిత్స సదుపాయం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ,విద్యార్థులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను తగిన భద్రత మధ్య తరలించాలని, పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్లు అనుమతించరాదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశం కావడంతో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ముఖ్యంగా చీఫ్ సూపరింటెండెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. గతం లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండజాగ్రత్ర వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, అసిస్టెంట్ కమిషనర్ బలరాం, డీసీఈబీ సెక్రటరీ ఎన్.లింగం, సంబంధిత శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు అత్యంత కీలకమైనదని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లాలోని పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పరీక్షల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల కోసం పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో విద్యార్థులకు అవసరమైన శక్తినిచ్చేందుకు ప్రొటీన్ స్నాక్స్ కూడా అందిస్తున్నామని, వీటి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించామని పేర్కొన్నారు. ఐఎఫ్పీ ప్యానెల్స్, ఖాన్ అకాడమీ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా బోధన సాగుతోందని వివరించారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లేలా చూడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ గైర్హాజరు కాకుండా పర్యవేక్షించాలని కోరారు. ఉదయం 5 గంటలకే విద్యార్థులను నిద్రలేపి చదివించాలని, రాత్రి 9 లేదా 10 గంటల వరకు క్రమబద్ధమైన జీవనశైలిని అలవాటు చేయాలని సూచించారు. పరీక్షల దృష్ట్యా విద్యార్థులను మొబైల్ ఫోన్లు, యూట్యూబ్, టీవీలకు దూరంగా ఉంచాలని, వారి కోసం తల్లిదండ్రులు సైతం వాటికి దూరంగా ఉండాలన్నారు. ఇంట్లో ఒత్తిడి లేని వాతావరణం కల్పించాలని, పిల్లలను భయపెట్టకుండా ప్రోత్సాహకరంగా మాట్లాడాలని తెలిపారు. చదువుతో పాటు రక్తప్రసరణ మెరుగుపడి మెదడు చురుగ్గా పని చేసేందుకు యోగా, ధ్యానం లేదా చిన్నపాటి వ్యాయామాలు చేయించాలని సూచించారు. తల్లిదండ్రులు తరచుగా పాఠశాల ఉపాధ్యాయులను కలిసి తమ పిల్లల ప్రగతిని అడిగి తెలుసుకోవాలని, ఏవైనా సబ్జెక్టుల్లో వెనుకబడి ఉంటే ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చూడాలని కోరారు. జిల్లా యంత్రాంగం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని, తద్వారా మొదటి సంవత్సరంలో మంచి ర్యాంకుతో సీటు సాధించవచ్చని ఆయన ఆకాంక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిసిఈడి సెక్రటరీ గజేందర్, సెక్టోరల్ అధికారులు రఘురమణ, తిరుపతి, సాంకేతిక సిబ్బంది విలాస్, ఇతర అధికారులు, పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రీగా టమాటా

వరంగల్ ఫిబ్రవరి 21టమాటా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అమ్మకానికి మార్కెట్‌కు తరలించిన టమాటా కోనే నాధుడు కరువయ్యాడు. కనీస గిట్టుబాటు ధర లేదు.. చేతికి అందిన పంట కుళ్లిపోతుండటంతో కొందరు రైతులు కడుపుమండి వినూత్న నిరసన తెలిపారు. వినియోదారులకు టమాటాలు ఉచిత సరఫరా చేసి ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని వారాంతపు సంతలో ఈ విచిత్ర సంఘటన జరిగింది. ఒక ట్రాలీ లోడ్ టమాటలు రైతులు ఉచితంగా సరఫరా చేశారు. ఆ టమాటాల కోసం జనం ఇగబడి సంచులు, బట్టలతో ఎగబడ్డారు. సాధారణ సమయంలో టమాటా ధరలు సెంచరీ కొట్టిన సందర్భం కూడా ఉంది. కానీ ఇప్పుడు టమాటా ధరలు నేల చూపులు చూస్తున్నాయి. రైతులు కనీసం కిలో 2 రూపాయల ధర పలకని టమాటా ధర చూసి బిత్తర పోతున్నారు.

# న్యూఢిల్లీ డిక్లరేషన్ కు 88 దేశాల మద్దతు

న్యూడిల్లీ ఫిబ్రవరి 21 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశిస్తోంది.'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు.

ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.

1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ)
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత
6. మానవ వనరుల అభివృద్ధి
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు

("ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరం" అని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది. 'చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ' అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది.శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com